

28 నుంచి అరకులోయకు ప్రత్యేక రైలు

విశాఖపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పర్యాటకుల సౌకర్యార్థం విశాఖ-అరకులోయ మధ్య ఈ నెల 28 నుంచి ప్రతి శని, ఆదివారాలు ప్రత్యేక రైలును ప్రవేశపెడుతున్నామని వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 08525 నంబరు గల రైలు ఈ నెల 28 నుంచి జనవరి 19వ తేదీ వరకు ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 8.30 గంటలకు విశాఖలో బయలుదేరి 11.45 గంటలకు అరకులోయ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08526 నంబరుతో ఈ రైలు అదేరోజు మధ్యాహ్నం 2.00 గంటలకు అరకులోయలో బయలుదేరి సాయంత్రం 6.00 గంటలకు విశాఖ చేరుతుంది.

రైల్వే జోన్‌పై తాత్సారం

ప్రధాన కార్యాలయం నిర్మాణానికి డిసెంబరులో శంకుస్థాపన చేయనున్నట్టు పలుమార్లు కేంద్ర మంత్రి, ఎంపీల ప్రకటన

- మరో వారంలో ముగియనున్న నెల
- ఇప్పటివరకూ అతీగతీ లేదు
- కొనసాగుతున్న టెండర్ల ప్రక్రియ
- ఇంతకీ వాల్తేరు డివిజన్ ఉన్నట్టా?, లేనట్టా?
- నాయకులకూ స్పష్టత కరువు

ముడసర్లోవలో రైల్వే జోన్‌కు కేటాయించిన భూమి


(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో రైల్వే జోన్ కార్యాలయం ఏర్పాటు అందని ద్రాక్షలా మారింది. అదిగో...ఇదిగో...అంటూ ఊరింపు మాటలే వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక భూమి సమస్య పరిష్కరించినా కేంద్రం మాత్రం పనుల ప్రారంభానికి ఎందుకనో ఇంకా ఆలోచన చేస్తోంది. విశాఖలో రైల్వే జోన్ కార్యాలయం నిర్మాణానికి డిసెంబరులో శంకుస్థాపన జరుగుతుందని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఉత్తరాంధ్ర ఎంపీలు గతంలో ప్రకటించారు. ఇంకో వారం రోజుల్లో డిసెంబరు ముగుస్తుంది. కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. ఇప్పటివరకూ శంకుస్థాపన తేదీ మాత్రం ఖరారు కాలేదు.

విశాఖపట్నంలో 'దక్షిణ కోస్తా' రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణానికి రూ.154.82 కోట్లు వ్యయం అవుతుందని రెండేళ్ల క్రితం అంచనా వేశారు. అయితే అందుకోసం రైల్వే అడిగిన ముడసర్లోవలోని 52 ఎకరాలను అప్పగించడంలో జిల్లా అధికారులు కాలయాపన చేశారు. దాంతో డీఆర్ఎం కార్యాలయం వెనుకనున్న వైర్‌లెస్ కాలనీలో అందుబాటులో ఉన్న భూమిలో జోనల్ కార్యాలయం నిర్మాణం కోసం డిజైన్లు రూపొందించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక భూ సమస్యను పరిష్కరించింది. ముడసర్లోవలో భూమిని అప్పగించడమే కాకుండా రెవెన్యూ రికార్డుల్లో మ్యుటేషన్ కూడా చేయించింది. ఈ ప్రక్రియ అంతా ఆగస్టు నెలాఖరులోనే పూర్తయింది.అయితే భూమి ఇచ్చిన వారం రోజుల్లో శంకుస్థాపన చేస్తామని రైల్వే మంత్రి తనమాట నిలుపుకోలేదు.

నెల రోజుల క్రితం టెండర్లు

ముడసర్లోవలో రైల్వే జోన్ కార్యాలయం నిర్మాణానికి నెల రోజుల క్రితం టెండర్లు పిలిచారు. వాటిని ఇంకా ఖరారు చేయలేదు. భవన నిర్మాణం రెండేళ్ల క్రితం రూపొందించిన నమూనాలోనే ఉంటుందా?, ఇంకేమైనా మార్పులు చేస్తారా?...అనేది కూడా వెల్లడించలేదు. జోనల్ కార్యాలయం నిర్మాణంతో నిమిత్తం లేకుండా అందుబాటులో ఉన్న రైల్వే భవనాల్లో కార్యకలాపాలు ప్రారంభించాలని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ఇటీవల రైల్వే మంత్రిని కోరారు. అయితే ఆ దిశగా ఎటువంటి అడుగులు పడడం లేదు. దక్షిణ కోస్తా జోన్‌పై పొడి పొడి మాటలు తప్పితే ఢిల్లీ నాయకులు స్పష్టంగా ఏమీ చెప్పడం లేదు.

వాల్తేరు డివిజన్ ఉంటుందా? రద్దు చేస్తారా?

కొత్త రైల్వే జోన్‌ను ప్రకటించినప్పుడు వాల్తేరు డివిజన్‌ను రద్దు చేస్తామని కేంద్రం ప్రకటించింది. విశాఖ కేంద్రంగా ఉన్న వాల్తేరు డివిజన్‌లో ప్రస్తుతం ఉన్న ప్రాంతాలను ఇతర డివిజన్లలో విలీనం చేస్తామని వెల్లడించింది. ఉత్తరాంధ్ర ప్రాంతాలను విజయవాడ డివిజన్‌లో కలపాలని, శ్రీకాకుళం జిల్లాలో ఒడిశాకు

... మిగతా 6వ పేజీలో

బడ్జెట్ ముసాయిదాకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

- హార్టీకల్చర్ విభాగానికి కేటాయింపులు పెంచాలని సూచన

విశాఖపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):

రానున్న 2025-26 ఆర్థిక సంవత్సరానికి 2025-26 జీవీఎంసీ అధికారులు తయారు చేసిన బడ్జెట్ ముసాయిదాను స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన సోమవారం సమావేశమైన స్టాండింగ్ కమిటీ బడ్జెట్‌పై సుదీర్ఘంగా చర్చించింది. ఏఏ మార్గాల ద్వారా జీవీఎంసీకి ఎంత ఆదాయం సమకూరుతుంది, ఏ విభాగాలకు ఏ మేరకు కేటాయింపులు ప్రతిపాదించిందీ అకౌంట్స్ విభాగం అధికారులు సభ్యులకు వివరించారు. ప్రారంభ నిల్వ కింద రూ.476.44 కోట్లతో కలిపి వివిధ పద్దుల ద్వారా జీవీఎంసీకి రూ.4,709.15 కోట్లు ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నట్టు అధికారులు తెలిపారు. అలాగే

... మిగతా 6వ పేజీలో

ఏపీటీడీసీ డీవీఎంగా జి.జగదీశ్


గేదెల జగదీశ్

విశాఖపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ విశాఖపట్నం డివిజనల్ మేనేజర్ (డీవీఎం)గా గేదెల జగదీశ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జండర్లు, సీనియర్ సిటిజన్ల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా విజయనగరంలో పనిచేస్తున్న ఆయన ఏపీటీడీసీలో డిప్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం ఆమోదించింది. ప్రస్తుతం డీవీఎంగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఏపీటీడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రమణమూర్తి బాధ్యతలు జగదీశ్‌కు అప్పగించారు.

అడ్డంకులు తొలగుతున్నాయ్

మరో రహదారికి మోక్షం

- ఆరు నెలల క్రితం సిరిపురం టైకూన్ సెంటర్‌లో రోడ్డు బ్లాక్స్ తొలగింపు
- నేడు రుషికొండ బీచ్ దక్షిణ మార్గంలో స్టాపర్ల ఎత్తివేత
- సందర్శకుల రాకపోకలకు అవకాశం


రుషికొండ దక్షిణం వైపు నుంచి బీచ్‌లోకి వెళ్లే మార్గం

విశాఖపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ పరిపాలనలో ఆ పార్టీ నాయకులు వారి స్వప్రయోజనాల కోసం ప్రజలకు అనేక ఇబ్బందులు సృష్టించారు. అవన్నీ ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఒక్కొక్కటిగా తొలగిపోతున్నాయి. ఈ ఆరు నెలల కాలంలో విశాఖ ప్రజలకు రెండు ప్రయోజనాలు చేకూరాయి. సిరిపురం టైకూన్ జంక్షన్‌లో డివైడర్ల తొలగింపు మొదటిది. వీఐపీ రోడ్డు నుంచి ఆశీల్‌మెట్ట వైపు, సిరిపురం నుంచి వీఐపీ రోడ్డులోకి వాహనాలు వెళ్లకుండా అప్పట్లో జంక్షన్ బ్లాక్ చేయించారు. నగరవాసులు ఎంత కోరినా వాటిని తొలగించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లోనే నాయకులంతా వెళ్లి ఆ బ్లాక్స్‌ను తొలగించారు. నాటి నుంచి ఆ మార్గంలో రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి.

ఇక రుషికొండపై రూ.500 కోట్లతో ప్యాలెస్ నిర్మించుకున్న నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆపరిసర ప్రాంతాల వైపు ఎవరూ రాకుండా కట్టడి చేశారు. రుషికొండ బీచ్‌లోకి గతంలో రెండు మార్గాలు ఉండేవి. కొండకు ఉత్తరం వైపు ఒకటి, దక్షిణం వైపు మరొకటి ఉండేవి. ప్యాలెస్ నిర్మాణం జరుగుతున్నప్పుడు అక్కడ కార్మికుల కోసం క్యాంపు పెట్టారు. దాంతో దక్షిణ మార్గం మూసేశారు. అక్కడి నుంచే ప్యాలెస్‌లోకి మరో ప్రధానమార్గం ఏర్పాటు చేయడంతో నిర్మాణం పూర్తయినా సరే సెక్యూరిటీ పేరుతో ఆ

... మిగతా 6వ పేజీలో


కోకోనట్ ఎరీనా వద్ద కోత

కొనసాగుతోన్న తీరం కోత!

- పట్టని జిల్లా యంత్రాంగం
- పదేళ్ల క్రితం కురుసుర మ్యూజియం వద్ద రోడ్డు వరకూ కోత
- నాడు యుద్ధప్రాతిపదికన చర్యలు
- నేడు వైఎంసీఏ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకూ 2.5 కి.మీ. మేర తీరంపై ఎఫెక్టు
- కనిపించని రక్షణ చర్యలు

విశాఖపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):

నగరంలో సముద్ర తీరం కోత కొనసాగుతోంది. వారం రోజుల నుంచి ఎక్కడో ఒకచోట కోతకు గురవుతోంది. ఆదివారం కురుసుర మ్యూజియానికి ఉత్తరాన కోకోనట్ ఎరీనాలో మరో రెండు చెట్లు కూలిపోయాయి. రెండు రోజుల క్రితం ఏడెనిమిది చెట్లు పడిపోయాయి. కోకోనట్ ఎరీనాకు రక్షణగా ఇనుము వలతో రాళ్లు ఏర్పాటుచేసినా ప్రయోజనం లేకపోయింది. అయితే పర్యాటకంగా అతి ముఖ్యమైన ఆర్కే బీచ్ కోతకు గురవుతున్నా ప్రభుత్వ యంత్రాంగాలు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పదేళ్ల క్రితం హుద్‌హుద్ తుపాన్ (2014 అక్టోబరు) సంభవించినప్పుడు, అదే ఏడాది డిసెంబరు, 2015 జనవరి మొదటి వారంలో కురుసుర మ్యూజియానికి దక్షిణాన బీచ్‌రోడ్డు వరకూ తీరం కోతకు గురైంది. మళ్లీ పదేళ్ల తరువాత ఈ ఏడాది అక్టోబరు, నవంబరు నెలల్లో బంగాళాఖాతంలో వరుసగా దానా, ఫెంగల్ తుఫాన్‌లు, వాటి తరువాత రెండు అల్పపీడనాలు వచ్చాయి. వాటన్నింటి ప్రభావంతో తీరం కోతకు గురవుతుందని వాతావరణ నిపుణులు వివరించారు. అయితే 2014లో కురుసుర మ్యూజియం దగ్గరే మాత్రమే కోతకు గురైందని, ఈ ఏడాది వైఎంసీఏ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకూ 2.5 కి.మీ. పొడవునా తీరం కోతకు గురికావడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. తుఫాన్‌లు ఒక్కటే తీరం కోతకు కారణం కాదని, వాతావరణంలో మార్పుల ప్రభావం, విశాఖ పరిసరాల్లో ప్రాజెక్టులు నిర్మాణం కూడా కొంత వరకూ కారణమని ఏయూ సముద్ర అధ్యయన, వాతావరణ విభాగం విశ్రాంత ఆచార్యుడు ఒకరు తెలిపారు.

కోత నివారణకు తాత్కాలిక చర్యలేవీ...

2014లో కురుసుర మ్యూజియం వద్ద బీచ్‌రోడ్డు వరకూ తీరం కోతకు గురైంది. దాంతో జిల్లా యంత్రాంగం, జీవీఎంసీ యుద్ధ ప్రాతిపదికన స్పందించి రక్షణ చర్యలు చేపట్టాయి. కోతకు గురైన బీచ్‌రోడ్డును పునరుద్ధరించాయి. ఈ పర్యాయం వైఎంసీఏ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకూ పలుచోట్ల కోతకు గురైనా తాత్కాలిక చర్యలు తీసుకోవాలన్న దిశగా అధికారులు ఆలోచన చేయకపోవడం విడ్డూరంగా ఉంది. కోస్టల్ బ్యాటరీ నుంచి భీమునిపట్నం వరకూ తీరంలో కోత నివారణకు వీఎంఆర్‌డీఏ, నేషనల్ కోస్టల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ కలిపి భారీ ప్రాజెక్టు చేపట్టనున్నాయి. అయితే అప్పటివరకూ తాత్కాలికంగా కోత నివారణకు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ, జిల్లా యంత్రాంగంపై ఉంది.

టీడీఆర్‌ల జారీపై విజిలెన్స్

- ఇటీవల కౌన్సిల్ సమావేశంలో టీడీఆర్‌లపై వాడీవేడి చర్చ
- భారీగా అక్రమాలు జరిగాయని సభ్యుల ఆరోపణ
- గత పదేళ్లలో జారీచేసిన టీడీఆర్ వివరాలు ఇవ్వాలని డిమాండ్
- తలలు పట్టుకుంటున్న అధికారులు
- మరోవైపు నిఘా వర్గాల ఆరాతో ఆందోళన



మధురవాడలో టీడీఆర్ బాండ్ జారీచేసిన జీవీఎంసీ స్వాధీనం చేసుకోని వైసీపీ నేతకు చెందిన భవనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) జారీ వ్యవహారం ఇప్పుడు జీవీఎంసీ అధికారుల్లో గుబులు రేపుతోంది. టీడీఆర్‌ల మంజూరులో పెద్దఎత్తున అవినీతి జరిగిందని ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఆరోపణలు గుప్పించారు. గత పదేళ్లలో జారీచేసిన టీడీఆర్‌ల జాబితా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ వివరాల సేకరణలో టౌన్‌ప్లానింగ్ అధికారులు తలమునకలయ్యారు. ఇంతలో టీడీఆర్‌ల గురించి విజిలెన్స్, సీఐడీ విభాగాల అధికారులు కూడా ఆరా తీస్తుండడం టౌన్‌ప్లానింగ్‌తోపాటు జీవీఎంసీ అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది.

జీవీఎంసీలో ప్రస్తుతం టీడీఆర్‌ల అంశంపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ప్రభుత్వ భూములు, వివాదాస్పద భూములు, గతంలో ఎప్పుడో రోడ్డు విస్తరణలో పోయిన భూములకు వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీఆర్‌లు జారీ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేగాకుండా టీడీఆర్ జారీచేసిన తర్వాత ఆయా భూములు/స్థలాలను స్వాధీనం చేసుకోవాల్సిన జీవీఎంసీ అందుకు విరుద్ధంగా వ్యవహరించింది. ఈనెల 11న జరిగిన జీవీఎంసీ సర్వసభ్య సమావేశంలో టీడీఆర్‌ల జారీపై వాడీవేడి చర్చ జరిగింది. ఎంతోమంది అనర్హులకు రూ.వందల కోట్ల విలువైన టీడీఆర్‌లు జారీ చేశారంటూ పలువురు కార్పొరేటర్లు ఆరోపించారు. అర్హులైన వారికి టీడీఆర్‌లు జారీచేయడానికి జాప్యం చేస్తున్న అధికారులు, దశాబ్దాల కిందట నిర్మించిన రోడ్డులో తమ స్థలం పోయినందున టీడీఆర్ జారీచేయాలంటూ ఇప్పుడు దరఖాస్తు చేసుకున్నవారికి టీడీఆర్‌లను ఎలా జారీచేస్తున్నారంటూ టౌన్‌ప్లానింగ్ అధికారులను నిలదీశారు. టీడీఆర్‌ల పేరుతో పెద్దఎత్తున అవినీతి జరిగిందని, జీవీఎంసీ ఆదాయానికి గండికొట్టేలా టీడీఆర్‌లను జారీ చేశారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ వ్యవహారంలో కొందరు టౌన్‌ప్లానింగ్, జీవీఎంసీ అధికారుల ప్రమేయం ఉందని ఆరోపణలు గుప్పించారు. గత పదేళ్లలో జీవీఎంసీ జారీచేసిన టీడీఆర్‌ల జాబితాను సభ్యులకు అందజేయాలని డిమాండ్ చేశారు. దీనికి కమిషనర్ సంపత్‌కుమార్ స్పందిస్తూ గత పదేళ్లలో 1,035 టీడీఆర్‌లు

... మిగతా 6వ పేజీలో

బ్యాంకుకు బురిడీ

- బంగారం తాకట్టు పెడతానంటూ రూ.14,69,000తో ఉడాయింపు


పోలీసులు విడుదల చేసిన నిందితుల ఫొటోలు

సీతంపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):

బంగారం తాకట్టు పెడతానంటూ బ్యాంకును ఒక వ్యక్తి బురిడీ కొట్టించాడు. తన ఖాతాకు రూ.14,69,000 బదిలీ చేయించుకుని, ఆ డబ్బుతో ఉడాయించాడు. ఇందుకు సంబంధించి ద్వారకా పోలీసులకు అందిన ఫిర్యాదులోని వివరాలు ఎలా ఉన్నాయి. అల్లిపురంలో నివాసం ఉంటున్నానంటూ తమరాన చిరంజీవి (40) సీతంపేటలో గల సీఎస్‌బి బ్యాంకుకు వెళ్లాడు. తన బంగారాన్ని సుజాతనగర్‌లో గల ఫెడరల్ బ్యాంకులో తాకట్టు పెట్టానని, దానిని అక్కడ నుంచి విడిపించి తమ బ్యాంకులో తాకట్టు పెడతానని నమ్మించాడు. అందుకు సంబంధించి కొన్ని చీటీలను, రసీదులను సీఎస్‌బీ బ్యాంకు అధికారులకు చూపించాడు. అక్కడి నుంచి సుజాతనగర్‌లో గల ఫెడరల్ బ్యాంకులో గల తన

... మిగతా 6వ పేజీలో

రోజ్‌గార్ మేళా


జ్యోతి ప్రజ్వలన చేసి రోజ్‌గార్ మేళాను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు. చిత్రంలో ఎంపీ ఎం.శ్రీభరత్, నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, ఇతర అధికారులు ఉన్నారు

నగరంలోని సాలిగ్రామపురంలో గల సాగరమాల ఆడిటోరియంలో సోమవారం రోజ్‌గార్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ముఖ్య అతిథిగా హాజరై...కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామకపు పత్రాలను అందజేశారు. ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగిస్తూ దేశాభివృద్ధి యువతపైనే ఆధారపడి ఉందన్నారు. ఇదే విధంగా ముందుకుసాగితే 2047 సంవత్సరంకల్లా వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

- మెయిన్ 12లో

రక్షిత్ ఫార్మాలో ప్రమాదం

- విష వాయువుల లీక్
- ఇద్దరు కార్మికులకు తీవ్ర అస్వస్థత
- ఒకరి పరిస్థితి ఆందోళనకరం

పరవాడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మా సిటీలోని 'రక్షిత్ డ్రగ్స్ ప్రైవేటు లిమిటెడ్' పరిశ్రమలో సోమవారం విష వాయువు లీక్ కావడంతో ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఇందుకు సంబంధించి పరవాడ సీఐ జి.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరిశ్రమలోని ప్రొడక్షన్ బ్లాక్ -1లో ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికులు ఉగ్రెసర్ గౌడ (26), దేవ్‌బాగ్ (38) సోమవారం తెల్లవారుజామున ఐదున్నర గంటలకు

... మిగతా 6వ పేజీలో

5వ వార్డులోని సమస్యలపై కలెక్టర్‌కు వినతి

కొమ్మాది, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ పరిధిలోని 5వ వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించాలని వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత కోరారు. సోమవారం ఆమె కలెక్టరేట్‌లో కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధురవాడలో వెటర్నరీ ఆసుపత్రి ఉన్న ప్రాంతం దేవదాయ శాఖకు చెందిన భూమి కావడంతో ఆసుపత్రి అభివృద్ధికి నోచుకోవడం లేదని చెప్పారు. అలాగే రాజీవ్ గృహకల్ప, వైఎస్సార్ కాలనీ, పీపీ 1, పీపీ 2 కాలనీలు, ఎన్టీఆర్ హుద్‌హుద్ కాలనీల్లో అంగన్‌వాడీ కేంద్రాలు లేక గర్భిణులు, బాలింతలు, చిన్నారులు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కేంద్రాలకు వెళ్లలేక వ్యయ ప్రయాసాలకు గురవుతున్నారని తెలిపారు. కొన్నిసార్లు జాతీయ రహదారిని దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు.ఆయా కాలనీల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. స్వతంత్రనగర్, గణేశ్‌నగర్ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, నాగోతి సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సన్మానం

కొమ్మాది, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కాకినాడలోని ఇంద్రపాలెం ద్రోణాచార్య అకాడమీలో గత నెల 19 నుంచి 24 వరకు జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పీఎంపాలెంకు చెందిన పోతిన అక్షయ ప్రణీత్ కాంస్య పతకం (14 ఏళ్ల విభాగం) సాధించాడు. ఈ మేరకు సోమవారం అక్షయ్ ప్రణీత్‌ను విక్టరీ చోటాకాన్ కరాటే అసోసియేషన్, ఇండియా అసోసియేషన్ సభ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. కరాటేలో రాణిస్తున్న అక్షయ్ ప్రణీత్‌ను కాలనీవాసులు అభినందించారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

కొమ్మాది, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరమని జిల్లా వినియోగదారుల సంఘం సభ్యురాలు రెహమున్నీసా బేగం అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా సోమవారం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వినియోగదారులు వస్తువులను కొనుగోలు చేసినప్పుడు రసీదు పొందినప్పుడే వస్తువు వాటి నాణ్యతపై వినియోగదారుల ఫోరంను ఆశ్రయించడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గొట్టేటి రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమిలిలో చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు

భీమునిపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన చేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. సోమవారం ఆయన అప్పికొండ వీధిలో పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు మారోజు సంజీవ్ కుమార్, ఐటీడీపీ నాయకులు మరుపిళ్ల రాజేంద్రప్రసాద్, అప్పికొండ నూకరాజు, అప్పికొండ నరసింగరావు, అప్పికొండ సురేంద్ర, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చిప్పాడలో గణిత దినోత్సవం

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిప్పాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం గణిత దినోత్సవం నిర్వహించారు. ముందుగా ఉపాధ్యాయులు గణిత శాస్త్రవేత్త శ్రీనివాసా రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు గణితంపై క్విజ్ పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎంవీటీ రత్నం, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, అనూరాధ, రామస్వామి, కనకరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి'

సింహాచలం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఈఓ వేంద్ర త్రినాథరావును సింహగిరి వర్తక సంఘం అధ్యక్షుడు ముగ్గు కిరణ్ కోరారు. సోమవారం ఆయన ఈఓను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ పనులు ప్రారంభానికి ముందు ఏడాది వ్యవధిలో షాపింగ్ కాంప్లెక్స్ పూర్తి చేస్తామని, వర్తకులు సూచించిన ప్రకారం నిర్మాణాలు జరుపుతామని అధికారులు హామీ ఇచ్చారని చెప్పారు.గడువు ముగిసినా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తికాకపోవడంతో వ్యాపారులు అమ్మకాలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వీలైనంత త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని విన్నవించారు.

క్రిస్మస్ వెలుగులు



భీమిలిలోని ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి



విద్యుత్ లైటింగ్‌తో కేటీస్‌పేట సెయింట్ పీటర్స్ చర్చి



మధురవాడ : లైటింగ్‌తో ధగధగలాడుతున్న చర్చి



కేటీస్‌పేట సెయింట్ పీటర్స్ చర్చి లోపల అలంకరణ

నియోజకవర్గంలోని పలు చర్చిలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. మంగళవారం రాత్రి నగర సంకీర్తనలతో ప్రారంభమయ్యే వేడుకలు బుధవారం క్రిస్మస్‌తో ముగియనున్నాయి. ఈమేరకు మధురవాడ, మిథిలాపురి వుడాకాలనీ, పరదేశిపాలెం, పీఎం పాలెం తదితర ప్రాంతాల్లోని చర్చిలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అలాగే భీమిలిలో కేటీస్‌పేట చర్చితో పాటు బ్యాంక్ రోడ్‌లో ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి, రోమన్ కేథోలిక్ చర్చిని వేడుకలకు సిద్ధం చేశారు.

- భీమునిపట్నం/మధురవాడ



పశువుల పాకలో బాల ఏసు

చంద్రబాబు, పవన్ చిత్రపటాలు బహూకరణ



వైద్యాధికారికి చిత్రపటాలు బహూకరిస్తున్న కూటమి నాయకులు

మధురవాడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) :మధురవాడ పీహెచ్‌సీతో పాటు పలు పాఠశాలలకు కూటమి నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలను సోమవారం బహూకరించారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ, జనసేన నాయకుడు మజ్జి విజయ కుమార్ ఆధ్వర్యంలో ఈ చిత్రపటాలను మధురవాడ పీహెచ్‌సీ, నగరంపాలెం పాఠశాల, వార్డు సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలకు అందించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వీటిని అందించినట్టు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, కూటమి నాయకులు అచ్చుతరావు, సూర్యప్రకాశ్‌రావు,నరసింగరావు, సత్యనారాయణ, కృష్ణయ్య, నరసింహనాయుడు, తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

చందన స్వాముల సంకీర్తనలు



స్వామివారి చిత్రపటంతో కీర్తనలు ఆపిస్తున్న చందన స్వాములు

సింహాచలం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని కీర్తిస్తూ 40 రోజులు నృసింహ దీక్షలు చేపట్టిన చందన స్వాములు సింహాచలం కొండదిగువ పుర వీధుల్లో సోమవారం సంకీర్తనలు చేస్తూ తిరువీధి నిర్వహించారు.వేకువజామున సింహాద్రిమఠం వ్యవస్థాపకుడు కసిరెడ్డి సురేంద్రస్వామి ఆధ్వర్యంలో స్వాములు పీఠంలో పూజలు చేసిన అనంతరం స్వామివారి చిత్రపటాన్ని చేత పట్టుకుని తొలిపావంచా వద్ద నుంచి ప్రధాన వీధుల్లో అప్పన్న కీర్తనలు పాడుతూ తిరువీధి జరిపారు.

తీరంలో బ్యూటీ సినిమా షూటింగ్



హీరో, హీరోయిన్‌పై సన్నివేశాల చిత్రీకరణ

విశాలాక్షినగర్/సాగర్‌నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవానిపాలెం తీరంలోని మూడు గుళ్ల అమ్మవార్ల ఆలయం ప్రాంతంలో సోమవారం బ్యూటీ సినిమా షూటింగ్ జరిగింది. వానరా సెల్యూలాయిడ్ బ్యానర్‌పై విజయారెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. విశాఖకు చెందిన అంకిత్ కొయ్య హీరో కాగా నరేశ్, వాసుకి, తదితరులు నటిస్తున్నారు. డైరెక్టర్ మారుతీ సమర్పణలో శివసాయి వర్ధన్ దర్శకత్వం వహిస్తున్నారు. విజయనగరం జిల్లాకు చెందిన ద్వారపు సాయికుమార్ కెమెరా మెన్‌గా, ఆర్ట్ డైరెక్టర్‌గా సురేశ్ దేవి పని చేస్తున్నారు. వారం రోజుల పాటు తీరంలో షూటింగ్ జరుగుతుందని యూనిట్ సభ్యులు తెలిపారు. అలాగే బీచ్ రోడ్డు, ఐటీ హబ్ ప్రాంతాల్లోనూ సినిమా షూటింగ్ జరిగింది. ఏబీ సినిమాస్ బ్యానర్‌పై శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రానికి సంబంధించిన కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సినిమాలో హీరోగా షణ్ముఖ్ జశ్వంత్ నటిస్తుండగా భార్గవ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సీనియర్ నటులు బ్రహ్మాజీ, శివాజీపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు.



కుటుంబ సభ్యులతో ఆటో రామ్‌ప్రసాద్, సినీ నటుడు శివాజీ

అప్పన్నను దర్శించుకున్న సినీ నటులు

సింహాచలం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని సోమవారం పలువురు సినీ నటులు దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో అడివివరం గ్రామానికి చెందిన పోలరాశి రామ్‌ప్రసాద్ (ఆటో రామ్ ప్రసాద్)తో పాటు హీరో శివాజీ ఉన్నారు. వారికి ఆలయ సిబ్బంది ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న నటుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి పూజలు అనంతరం పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు ప్రసాదాలను అందజేశారు.

ఆకట్టుకున్న విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన

పద్మనాభం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని గోస్తనీ విద్యా పీఠ్‌లో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా సోమవారం విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పి. రమణ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. విద్యార్థులు గణితం, విజ్ఞానశాస్త్రం, సాంఘిక, భాషా శాస్త్రాలకు చెందిన పలు అంశాలను తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు కె. సూరిబాబు, హెచ్ఎం పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే గంటా పర్యటన

భీమునిపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం పట్టణంలో పర్యటించనున్నారు. ఉదయం పదిన్నర గంటలకు ఆయన సముద్ర కోతకు గురవుతున్న బీచ్ రోడ్‌ను సందర్శిస్తారు. 11 గంటలకు పట్టణంలో విస్తరించనున్న మెయిన్ రోడ్, బీచ్‌రోడ్, నరసింహస్వామి కొండ రహదారులను పరిశీలిస్తారని క్యాంపు కార్యాలయం అధికారులు తెలిపారు.

గీతం పాలక మండలి సభ్యుల నియామకం

సాగర్‌నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీ పాలక మండలి సభ్యులుగా రిటైర్డ్ జడ్జి కె. విజయలక్ష్మి, ప్రముఖ అంతర్జాతీయ బ్యాంకింగ్ రంగ నిపుణురాలు పద్మజా చుండూరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జస్టిస్ కె. విజయలక్ష్మి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హైకోర్టులో జడ్జిగా సేవలందించారు. పద్మజా చుండూరి భారత్, అమెరికాలో 37 ఏళ్ల పాటు బ్యాంకింగ్, క్యాపిటల్ మార్కెటింగ్‌లో అనుభవం కలిగిన ప్రముఖ ఆర్థికవేత్తగా పని చేశారు.

అఖిల భారత అథ్లెటిక్స్ పోటీలకు గీతం జట్టు

సాగర్‌నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భువనేశ్వర్‌లోని కిట్ విశ్వవిద్యాలయంలో ఏఐయూ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి 29 వరకు జరిగే అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్ (పురుషుల) పోటీలకు గీతం జట్టును ఎంపిక చేసినట్టు వర్సిటీ క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ యు. విజయకుమార్ తెలిపారు. మేనేజర్‌గా జియాద్, కోచ్‌గా ఎ. మురగన్ వ్యవహరిస్తారని ఆయన చెప్పారు.

పీజీఆర్ఎస్‌కు రెండు అర్జీలు

భీమునిపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు రెండు అర్జీలు అందాయి. రెవెన్యూ ఇంజనీరింగ్ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున అర్జీలు అందాయని కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు చెప్పారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

ఆనందపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గంభీరం పంచాయతీకి చెందిన వివాహిత కొద్ది రోజులుగా కనిపించడం లేదని ఆమె భర్త స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమ వారం ఫిర్యాదు చేశారు. రాజస్థాన్‌లోని అంగిగోలా గ్రామానికి చెందిన శాంతిలాల్ తన భార్య అస్తుకుమారి (34)తో కలిసి గంభీరంలోని ఐఐఎం రోడ్డులో బొమ్మలు తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం కూరగాయలు తీసుకువస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన అస్తుకుమారి తిరిగి ఇంటికి రాలేదు. భర్త చుట్టు పక్కల వెతికినా.. ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్టు సీఐ వాసునాయుడు చెప్పారు.

అపరిశుభ్రంగా గాంధీజీ పార్క్



యాంబ్లమ్ వద్ద పరిసరాల దుస్థితి, అక్షరాల్లో పగిలిన ఈ

భీమునిపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీచ్ రోడ్‌లో ఉన్న మునిసిపల్ గాంధీజీ పార్క్‌లో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. పార్క్‌లో తూర్పు భాగంలో ఐ లవ్ భీమిలి యాంబ్లమ్ ఏర్పాటు చేశారు. బీచ్‌కు వచ్చిన సందర్శకుల్లో చాలా మంది ఇక్కడ ఫొటోలు తీసుకుంటుంటారు. ఇక్కడ నేల లోతట్టుగా ఉండడం, పెద్ద పెద్ద రాళ్లు ఉండడంతో కొందరు పర్యాటకులు జారి పడుతున్నారు. ఐ లవ్ భీమిలి అక్షరాల్లో ఇ అక్షరం విరిగిపోయింది. గాంధీ విగ్రహాలు రంగులు వెలసిపోయాయి. పార్కులో ఉన్న సిమెంట్ బెంచీలు, కుర్చీలపై తిండి పదార్థాల కవర్లు, చెత్త పడేయడంతో అపరిశుభ్రత ఏర్పడుతుంది. రాత్రివేళ ఇక్కడ మందుబాబులు మద్యం సేవిస్తున్నట్టు పలువురు చెబుతున్నారు. జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.

భీమిలిలో భూ రికార్డుల ప్రత్యేక పరిశీలన

- తహసీల్దార్ రామారావు
- అమనాంలో రెవెన్యూ సదస్సు

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులో వచ్చిన వినతుల మేరకు 2019 కి ముందు తర్వాత భూముల పరిస్థితి ఏవిధంగా ఉందో పరిశీలిస్తామని తహసీల్దార్ పి. రామారావు తెలిపారు. సోమవారం అమ నాంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు.భూములు ఏమేరకు అన్యాక్రాంతం అయ్యాయన్నది వచ్చిన ఫిర్యాదుల మేరకు పరిశీలిస్తామని చెప్పా రు. గతంలో ఉన్న భూములు ఎవరి పేరుతో మారాయన్నది కూడా పరిశీలిస్తా మన్నారు. అనంతరం స్థానికుల నుంచి 51 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సూర్యనారాయణరాజు, టీడీపీ నాయకులు ఆదిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సర్వేయర్ సంధ్య పాల్గొన్నారు.

సింహాచలం : అడివివరం గ్రామ కంఠం భూములకు విముక్తి కల్పించాలని స్థానికులు అధికారులను కోరారు. సోమవారం చినగదిలి తహసీల్దార్ పాల్ కిరణ్ ఆధ్వర్యంలో 98వ వార్డు ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నరసింహం, అడివివరం సహకార పరపతి సంఘం పాలక మండలి అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, జనసేన వార్డు అధ్యక్షుడు మజ్జి సూరిబాబు, వైసీపీ వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరంబాబు తదితరులు 22ఏ (1సి)లో అధికారులు అనాలోచితంగా చేర్చిన అడివివరం గ్రామ కంఠం భూములను తొలగించాలని డిమాండ్ చేశారు.అలాగే బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్వాసితులు తమకు తక్షణమే టీడీఆర్‌లు జారీ చేయాలని, మరికొందరు పంచ గ్రామాల భూ సమస్యలను పరిష్కరించాలని వినతులు ఇచ్చారు. మొత్తం 25 ఫిర్యాదులు రాగా ఎక్కువగా 22ఏ (1సి) నుంచి అడివివరం గ్రామ కంఠం భూములను తొలగించి తమ హక్కులను పునరుద్ధరించాలని కోరినట్టు తహసీల్దార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ హరితేజ్, జీవీఎంసీ ఆర్ఐ స్వాతి, దేవదాయ శాఖ ప్రత్యేక అధికారి రాజగోపాల్‌రెడ్డి, సింహాచలం దేవస్థానం పర్యవేక్షణాధికారి రామారావు పాల్గొన్నారు.



అమనాం సదస్సులో పాల్గొన్న అధికారులు

ఈఎన్‌సీ, హోమీ బాబా ఆస్పత్రి మధ్య ఎంఓయూ



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

విశాఖపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పు నౌకాదళం, హోమీ బాబా ఆస్పత్రి యాజమాన్యం మధ్య సోమవారం అవగాహన ఒప్పందం జరిగింది. నేవీ ఉద్యోగులకు కేన్సర్ సంబంధిత వ్యాధులకు పరీక్షలు, చికిత్సను నగదు రహితంగా చేయడానికి ఇరు సంస్థలు అంగీకారానికి వచ్చి, ఒప్పందం కుదుర్చుకున్నాయి.

రైల్వే జోన్‌పై తాత్సారం

... 5వ పేజీ తరువాయి

దగ్గరగా ఉన్న ప్రాంతాలను తూర్పు కోస్తా జోన్‌లోని ఖుర్దా డివిజన్‌లో కలుపుతామని పేర్కొంది. విజయనగరం జిల్లాలో కొత్తవలస నుంచి మొదలయ్యే కేకే లైన్‌ను కిరండోల్ వరకూ కొత్తగా ఏర్పాటు చేసే రాయగడ డివిజన్‌లో కలుపుతామని ప్రకటించారు. విచిత్రం ఏమిటంటే...విశాఖలో కొత్త జోన్ ఏర్పాటు చేయకుండా, వాల్తేరు డివిజన్ రద్దు కాకుండానే రాయగడలో కొత్త డివిజన్ కార్యాలయం నిర్మాణం ప్రారంభించారు. అక్కడ చూపించిన చొరవ ఇక్కడ కనిపించకపోవడం గమనార్హం. ఆదాయ సముపార్జనలో వాల్తేరు డివిజన్ టాప్-5లో ఒకటిగా ఉంది. ఇది రద్దయితే సరకు రవాణా ఆదాయం దక్షిణ కోస్తా జోన్‌కు కాకుండా తూర్పు కోస్తా జోన్‌కు పోతుంది. ఒత్తిళ్లకు లొంగి జోన్ ఇవ్వడమే తప్ప విశాఖను ఉన్నత స్థానంలో నిలపాలనే ఉద్దేశంతో కేంద్ర రైల్వే పెద్దలు ఏ పనీ చేయడం లేదు.

బడ్జెట్ ముసాయిదాకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

... 5వ పేజీ తరువాయి

వివిధ పద్దుల కింద అన్ని విభాగాల ద్వారా రూ.4,554.27 కోట్లు ఖర్చు చేయబోతున్నట్టు పేర్కొన్నారు. అయితే నగరంలో పచ్చదనం పెంచాల్సి ఉందని అందుకోసం హార్టికల్చర్ విభాగానికి అదనపు కేటాయింపులు జరపాలని సూచించిన కమిటీ సభ్యులు...బడ్జెట్ ముసాయిదాను ఆమోదించాలని మేయర్‌ను కోరారు. దీంతో సభ్యులు సూచించిన సవరణలు చేసిన తర్వాత కౌన్సిల్‌లో ముసాయిదాను ప్రవేశపెట్టాలని సూచిస్తూ మేయర్ ముసాయిదాకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అడ్డంకులు తొలగుతున్నాయ్

... 5వ పేజీ తరువాయి

మార్గాన్ని ఓపెన్ చేయలేదు. దాంతో బీచ్‌లోకి ఒక్కటే మార్గం కావడంతో వారాంతపు రోజుల్లో రద్దీ పెరిగి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను మీడియా ఎత్తిచూపడంతో కూటమి నేతలు స్పందించారు. పర్యాటక శాఖ అధికారులతో సంప్రతించి దక్షిణ మార్గం ప్రారంభించాలని సూచించారు. ఆ పనులన్నీ పూర్తి కావడంతో విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, జాయింట్ కలెక్టర్ మయూర అశోక్ అంతా కలిసి సోమవారం మధ్యాహ్నం దానిని పునఃప్రారంభించారు. ఈ మార్గంలో బీచ్ వ్యూ బాగుంటుందని అంత సంతోషం వ్యక్తంచేశారు.

నియోజకవర్గ ఎమ్మెల్యే లేకుండానే...

రుషికొండ భీమిలి నియోజకవర్గంలో ఉంది. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు లేకుండా, ఆయన నగరంలో లేనప్పుడు ఈకార్యక్రమం ఏర్పాటు చేయడంపై ఆయన అనుచరులు అసంతృప్తి వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఈ విషయమై అధికారులపై మండిపడినట్టు తెలిసింది. వివాదాలకు తావివ్వకుండా అంతా అందుబాటులో ఉన్నప్పుడు చేసి ఉంటే బాగుండేదని అధికారులకు చెప్పినట్టు సమాచారం.

బ్యాంకుకు బురిడీ

... 5వ పేజీ తరువాయి

ఖాతాకు రూ.14,69,000 బదిలీ చేయించుకున్నాడు. డబ్బు డ్రా చేసుకుని తీసుకువద్దామంటూ సీఎస్‌బీ బ్యాంకు ప్రతినిధులు ఇద్దరిని సుజాత నగర్‌లోని ఫెడరల్ బ్యాంకుకు తీసుకువెళ్లాడు. వారిని బయట కూర్చోబెట్టి బ్యాంకులోకి వెళ్లిన చిరంజీవి తన ఖాతాలోని డబ్బును డ్రా చేసుకుని...మరొకరితో కలిసి ఉడాయించాడు. సీఎస్‌బీ బ్యాంకు ప్రతినిధులు కొద్దిసేపు వేచిచూసి ఫెడరల్ బ్యాంకులోకి వెళ్లి ఆరా తీయగా చిరంజీవి అనే వ్యక్తి ఎటువంటి బంగారం తాకట్టు పెట్టలేదని తేలింది. దీంతో తమను మోసగించాడని సీఎస్‌బీ సిబ్బంది గ్రహించారు. ఈ మేరకు ద్వారకా పోలీసులకు బ్యాంకు ఆపరేషన్ మేనేజర్ పద్మవీణా ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేంద్ర కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. తమరాన చిరంజీవి వివరాలు తెలిసినవారు ఎవరైన ద్వారకా సీఐ శ్రీనివాసరావు (ఫోన్ నంబర్ 7995093604), ఎస్ఐ ధర్మేంద్ర (8555813894)కు సమాచారం తెలియజేయాలని కోరారు. చిరంజీవి, అతడికి సహకరించిన మరొకరి ఫొటోలను విడుదల చేశారు.

టీడీఆర్‌ల జారీపై విజిలెన్స్

... 5వ పేజీ తరువాయి

జారీచేసినట్టు వివరించారు. వాటి వివరాలను సభ్యులందరికీ అందజేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఒక్కో టీడీఆర్‌కు సంబంధించి కనీసం వంద పేజీల ఫైల్ ఉంటుందని, ఒకేసారి గత పదేళ్లలో జారీచేసిన 1,035 టీడీఆర్‌ల జాబితా తయారుచేయడం ఎలా సాధ్యమవుతుందని టౌన్‌ప్లానింగ్ అధికారులు గగ్గోలు పెడుతున్నారు. ముందుగా అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా ఉన్నంతలో టీడీఆర్‌ల వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

టీడీఆర్‌లపై విజిలెన్స్ ఆరా

జీవీఎంసీలో టీడీఆర్‌లపై పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతుండడం, పత్రికల్లో వరుస కథనాలు వస్తుండడంతో విజిలెన్స్, సీఐడీ విభాగాల అధికారులు కూడా దీనిపై దృష్టిసారించినట్టు తెలిసింది. ఇప్పటికే జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వెళ్లి కొన్ని టీడీఆర్‌లకు సంబంధించిన సమాచారం సేకరించినట్టు తెలిసింది. టీడీఆర్ జారీచేసిన కొన్ని స్థలాలకు సంబంధించిన ఫైళ్లను టౌన్‌ప్లానింగ్ అధికారులు నుంచి తీసుకువెళ్లినట్టు చెబుతున్నారు. పదేళ్లలో జారీచేసిన టీడీఆర్‌ల సమాచారాన్ని క్రోడీకరించే పనిలో ఉన్న అధికారులకు విజిలెన్స్ సీఐడీ అధికారులు అదే అంశంపై ఆరా తీస్తుండడంతో నిద్రపట్టడం లేదు. ఏ క్షణంలో ఎలాంటి పరిస్థితి ఎదురువుతోందోనని టీడీఆర్‌ల జారీలో అవకతవకలకు పాల్పడి నవారు ఆందోళన చెందుతున్నారు.

రక్షిత్ ఫార్మాలో ప్రమాదం

... 5వ పేజీ తరువాయి

స్పృహ కోల్పోయి ఉన్నారు. వారిని బ్లాక్-2 నుంచి కిందకు వస్తూ కెమిస్టు నాగేశ్వరరావు గమనించారు. అప్పటికే దేవ్‌బాగ్ అపస్మారక స్థితిలోకి జారుకోగా, ఉగ్రెసర్ గౌడ ఫిట్స్ వచ్చినట్టు కాళ్లు, చేతులు కొట్టుకుంటున్నారు. వెంటనే ఇద్దరికీ పరిశ్రమలోనే ఆక్సిజన్ ఏర్పాటుచేసి అనంతరం గాజువాక సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. వీరిలో దేవ్‌బాగ్ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రొడక్షన్ బ్లాక్-1లో మొత్తం తొమ్మిది మంది కార్మికులు పనిచేస్తున్నారు. తెల్లవారుజామున ఐదున్నర గంటల సమయంలో మిగతా ఏడుగురు షిఫ్ట్ ఛేంజింగ్ కోసమని సెక్యూరిటీ వద్దకు వెళ్లి పంచింగ్ చేయడంలో నిమగ్నమయ్యారు. అదే సమయంలో బ్లాక్-1లో రియాక్టర్ నుంచి హైడ్రోజన్ సల్ఫైడ్ వాయువు రియాక్టర్‌కు చెందిన స్క్రబ్బర్ నుంచి లీకై ఉండవచ్చునని, వాటిని పీల్చడం వల్ల అక్కడ ఉన్న ఇద్దరూ అస్వస్థతకు గురై ఉంటారని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఉగ్రెసర్, దేవ్‌బాగ్‌లు షిఫ్ట్ ముగిసిన తరువాత కాసేపు విశ్రాంతి తీసుకోవడానికి అక్కడ కూర్చుని ఉంటారని తోటి కార్మికులు చెబుతున్నారు. వాయువులు ప్రొడక్షన్ బ్లాక్‌లో ఎక్కడ నుంచి లీకయ్యాయో గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అధికారులు

ప్రమాదం చోటుచేసుకున్న రక్షిత్ డ్రగ్స్‌లోని ప్రొడక్షన్ బ్లాక్‌ను పరిశ్రమల తనిఖీ అధికారులు జె.శివశంకరరెడ్డి, జేజీఎస్ నారాయణరావు, తహసీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్, సీఐ మల్లికార్జునరావుతో పాటు పీసీబీ, అగ్నిమాపక శాఖ అధికారులు పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందో యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. వాయువులు ఎక్కడ లీకయ్యాయో తెలుసుకునే పనిలో ఉన్నారు.



విద్యుత్ వెలుగుల్లో శ్రీనగర్‌లోని చర్చి



షీలానగర్ హయ్యర్ లూథరన్ మెమోరియల్ చర్చి



విద్యుద్దీప కాంతుల్లో వడ్లపూడిలోని చర్చి

కాంతులీనుతున్న చర్చిలు

క్రిస్మస్ శోభతో మెరిసిపోతున్న ప్రార్థనా మందిరాలు

గాజువాక/ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగ నేపథ్యంలో పలు ప్రాంతాల్లోని చర్చిలన్నీ విద్యుద్దీప కాంతులతో మెరిసిపోతున్నాయి. క్రైస్తవ సోదరులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే క్రిస్మస్ బుధవారమే కావడంతో చర్చిలన్నింటినీ శోభాయమానంగా అలంకరించారు. ఆయా చర్చిల్లో క్రైస్తవులు కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు జరుపుతున్నారు. ఏసు జనన దృశ్యాలను కళ్లకు కట్టినట్టుగా పలు చర్చిల ప్రాంగణాల్లో సెట్‌లు వేసి అందంగా తీర్చిదిద్దారు. క్రిస్టియన్లు తమ ఇళ్ల వద్ద క్రిస్మస్ స్టార్లు, ట్రీలను ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహించుకుంటున్నారు. పండగ నేపథ్యంలో బుధవారం చర్చిల్లో జరిగే ప్రత్యేక ప్రార్థనలకు క్రిస్టియన్లతో పాటు ప్రజలు అధిక సంఖ్యలో రానున్న పాస్టర్లు, నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

మార్కెట్‌లో క్రిస్మస్ సందడి

పండగ నేపథ్యంలో పలు ప్రాంతాల్లోని షాపింగ్ కాంప్లెక్స్‌ల వద్ద ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి క్రిస్మస్ ట్రీలు, స్టార్‌లు, శాంతాక్లాజ్ బొమ్మలు, టోపీలు, సామగ్రిని విక్రయిస్తున్నారు. వాటి కొనుగోలుదారులతో మార్కెట్ కిటకిటలాడతోంది. అలాగే వస్త్ర దుకాణాలు రద్దీగా కనిపిస్తున్నాయి. కొనుగోలుదారులను ఆకట్టుకునేందుకు పలు షాపుల వద్ద శాంతాక్లాజ్ వేషధారులను వ్యాపారులు ఏర్పాటు చేశారు.

కూర్మన్నపాలెం: క్రిస్మస్ నేపథ్యంలో అన్ని కాలనీల్లోని క్రైస్తవుల ఇళ్లు రంగురంగుల స్టార్స్, విద్యుత్ వెలుగులతో మెరుస్తున్నాయి. అలాగే చర్చిలను కలర్‌ఫుల్‌గా నిర్వాహకులు తీర్చిదిద్దారు. వీటితో పాటు ప్రధాన కూడళ్లు అయిన శ్రీనగర్, వడ్లపూడి, దువ్వాడ, కూర్మన్నపాలెం, కణితి, కాపు జగ్గరాజుపేట, సిద్ధార్థ నగర్ చర్చిల వద్ద చిన్న చిన్న పాకలను ఏర్పాటు చేసి ఏసుప్రభు జనన దృశ్యాలతో కూడిన విగ్రహాలను, శాంతాక్లాజ్‌ల బొమ్మలను కొలువుదీర్చారు. ఇవి చూపరులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి.



పాత గాజువాకలో కాంతులీనుతున్న హోలీక్రాస్ చర్చి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68, 69 వార్డుల్లోని ప్రార్థనా మందిరాలు క్రిస్మస్ పండగకు సర్వాంగ సుందరంగా ముస్తాబయాయి. షీలానగర్‌లోని హయ్యర్ మెమోరియల్ లూథరన్ చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పాటు మంగళవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. రామ్‌నగర్‌లోని చర్చి వద్ద పెద్ద స్టార్‌తో పాటు రంగురంగుల లైట్లతో విరాజిల్లుతోంది. అలాగే హరిజన జగ్గయ్యపాలెంలోని సియోను ప్రార్థనా మందిరం, తుంగ్లాం, అక్కిరెడ్డిపాలెంలోని చర్చిలు కళకళలాడుతున్నాయి.



గాజువాకలోని యునైటెడ్ బాపిస్టు చర్చి

పెదగంట్యాడ: మండలంలో పలు చర్చిలు క్రిస్మస్ పండక్కి సిద్ధమయ్యాయి. ప్రధానంగా హెచ్‌బీ కాలనీలోని రేమా బ్లెస్సింగ్ చర్చి, దిబ్బపాలెం, సిద్ధేశ్వరం, సీతానగరం పోర్టు రోడ్డు, బీసీ రోడ్డులలో గల చర్చిలను విద్యుత్ లైట్లతో, క్రిస్మస్ ట్రీస్, స్టార్‌లతో అందంగా అలంకరించారు. విద్యుత్తు సీరియల్ సెట్‌లు అమర్చారు. బుధవారం ఆయా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపేందుకు పాస్టర్లు, నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ శేషాద్రి

అభివృద్ధి పనులను నిరంతరం పరిశీలించాలి

అధికారులకు జోనల్ కమిషనర్ శేషాద్రి ఆదేశం

గాజువాక, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలో జరుతున్న పలు అభివృద్ధి పనులను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జోనల్ కమిషనర్ శేషాద్రి ఆదేశించారు. సోమవారం జోన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని, ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. తాగునీరు, వీధిలైట్లు ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ వసూళ్లలను వేగవంతం చేయాలని శేషాద్రి పేర్కొన్నారు. సమావేశంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రూ.కోటీ రెండు లక్షల ఆస్తి పన్ను వసూలు

జోన్ పరిధిలో సోమవారం ఒకరోజే రూ.కోటీ రెండు లక్షల ఆస్తి పన్నును అధికారులు చేశారు. ఇందుకు సంబంధించిన చెక్కులను ఆర్వో రాంనారాయణ, ఆర్‌ఐలు శివ, మోహన్‌లు జెడ్సీకి అందజేశారు.

'అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి'

కూర్మన్నపాలెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించేందుకు సచివాలయ సిబ్బంది, ఆర్పీలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ అన్నారు. వార్డు పరిధిలోని వడ్లపూడి సచివాలయంలో సోమవారం సచివాలయ సిబ్బంది, ఆర్పీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వార్డు అభివృద్ధి కోసం రూ.12 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. అనంతరం ఆయన పాత వడ్లపూడిలో చేపట్టిన టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. కార్యక్రమంలో వార్డు అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఎస్ఎస్ విజయరామరాజు, నాయకులు రాజన్‌రాజు, ఎం.రాము, బాబూరావు, పి.కృష్ణ, రాంబాబు, ఎస్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా క్షమాపణలు చెప్పాలంటూ ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించేలా కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడడం సరికాదని, తక్షణమే ఆయన క్షమాపణలు చెప్పాలని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, కేవీపీఎస్ ప్రతినిధులు డిమాండ్ చేస్తూ సోమవారం స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ భవనం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా అమిత్‌షా మాట్లాడడం భావ్యం కాదన్నారు. నాయకులు బయ్యే మల్లయ్య, సత్యనారాయణ, దాసు, చిరంజీవి, పరంధామయ్య, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా భూ సమస్యలను పరిష్కరించుకోవాలి

అగనంపూడి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజలందరూ తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ సూచించారు. వార్డు పరిధిలోని రామాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యనైనా సదస్సు ద్వారా పరిష్కరించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. తమ సమస్యలను దరఖాస్తు ద్వారా రెవెన్యూ అధికారులకు తెలియజేస్తే 45 రోజుల్లోగా సమస్య పరిష్కారం అవుతాదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంబేడ్కర్, డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌నాయుడు, స్థానిక నాయకులు సర్వసిద్ధి సన్యాసిరాజు, యర్రా కోటేశ్వరరావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

గోపాలపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబుకు విశాఖ నూర్ బాషా ముస్లిం అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రాన్ని అందజేశారు. గోపాలపట్నం మసీదులో సోమవారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. శ్మశానవాటికకు స్థలాలు కేటాయించాలని, ఈద్‌గాహ్, షాదీఖానా నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ఆర్థికంగా వెనుకబడిన వారి అభ్యున్నతికి ప్రభుత్వ కేటాయించిన నిధులు మంజూరుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు షేక్ బుర్హాన్, షేక్ నాగూర్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 ఫిర్యాదులు

వేపగుంట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 ఫిర్యాదులు అందాయి. వీటిలో 90వ వార్డులో సుసర్లకాలనీలో ఐరన్ బ్రిడ్జి తొలగించాలని, ట్రేడ్ లైసెన్స్ సమస్య పరిష్కరించాలని, 95వ వార్డు లక్ష్మీపురంలో రహదారి ఆక్రమణ తొలగించాలని, 96వ వార్డు దగ్గువానిపాలెంలో పిచ్చి మొక్కలు తొలగించాలని, 97వ వార్డు సుజాతనగర్‌లో కాలువ ఆక్రమణను అడ్డుకోవాలని, 98వవార్డు పార్వతీనగర్‌లో చెట్లకొమ్మలు తొలగించాలని కోరారు. పరిష్కారానికి చర్యలు చేపడతామని జెడ్సీ కె.హైమావతి తెలియజేశారు.

ఎస్ఆర్‌పురంలో చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు

పెందుర్తి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఆర్‌పురంలో టీడీపీ సభ్యత్వ నమోదును పార్టీ శ్రేణులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. యాప్ ద్వారా వంద మందికి సోమవారం సభ్యత్వం అందించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ ఆదేశాలతో గ్రామంలో పార్టీని బలోపేతం చేస్తున్నామని నేతలు తెలిపారు. కార్యక్రమంలో దూది సుందరమ్మ, తాడి వెంకటరమణ, ఒమ్మి సోంబాబు, గోపాల సోంబాబు, సుంకర కోటి, జోగ ఆదినారాయణ, పల్ల భీసాలు. బలమాని దేవుడు, గుమ్మడి గణేశ్, కొత్తలంక శేఖర్ గొల్లవిల్లి గణేశ్, జక్కుల రాజశేఖర్, యర్ర రమణ, బల్ల రమేశ్ పాల్గొన్నారు.

వెంకటాద్రిపై ఘనంగా ధనుర్మాసోత్సవాలు

పెందుర్తి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వెంకటాద్రి శిఖరంపై ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం స్వామిని వెండి కవచాలతో అలంకరించి విశేష హారతులిచ్చారు. గోదాదేవి అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం తిరుప్పావైలోని గోదాదేవి తొమ్మిదో పాశురాన్ని పఠించారు. ఆరు ప్రసాదాలను నివేదించారు. భక్తులకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించారు. సరిపల్లి రామాలయంలో భక్తబృందం సీతారాముల విగ్రహాలతో గ్రామంలో మేలుకొలుపు సంచారం చేశారు.

పులగాలిపాలెంలో రెవెన్యూ సదస్సు



రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

పెందుర్తి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులగాలిపాలెంలో సోమవారం అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఎన్‌హెచ్ 16 ఎస్‌డీసీ జె.సీతారామారావు హాజరై భూ సమస్యలకు సంబంధించిన 93 అర్జీలను స్వీకరించారు. ఆర్వోఆర్ దరఖాస్తులు 49, ఎఫ్‌లైన్ 37, ఆక్రమణలు 3 ఇతరాలు మూడు ఉన్నాయి. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌కుమార్, జనసేన నేత ఐతి సింహాచలంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీ అందుకుంటున్న ప్రకాశ్

కరాటే పోటీల్లో ప్రకాశ్‌కు పసిడి పతకం

సింధియా, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాకినాడలో జరిగిన విక్టర్ షాటోకన్ కరాటే నిర్వాహకుల ఆధ్వర్యంలో జరిగిన మూడో ఇన్విటేషన్ నేషనల్ ఓపెన్ కరాటే పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 1,800 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో 62వ వార్డు పరిధి ప్రకాశ్‌నగర్‌కు చెందిన టి.ప్రకాశ్ బ్లాక్ బెల్ట్ మాస్టర్ కాటా విభాగంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

'విజ్ఞాన్'లో క్రిస్మస్ వేడుకలు

అగనంపూడి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అరుంధతి కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ విశిష్టత, ఏసుప్రభు గొప్పతనం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి :** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2 :** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యుఐ :** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2 :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 28, వంకాయలు (తెలుపు) 38,వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 36, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 42, బీరకాయలు 50, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 24, క్యారెట్ 38 దొండకాయలు 46, బంగాళదుంపలు 30, అరటికాయ 6, మునక్కాడలు (కిలో) 140, అల్లం 56, బరబాటి 42, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 30 దోసకాయలు 28, వెల్లుల్లి 320, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 56, కీరదోస 36, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 42, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	595
విజయనగరం	599
శ్రీకాకుళం	599

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	90
ఫారం ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

ఫార్మా బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే పంచకర్ల

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పరవాడ మండలంలోని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాలోని రక్షిత్ర డ్రగ్స్ కంపెనీలో విష వాయువు లీకైన ఘటనలో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను సోమవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పరామర్శించారు. షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలోని ఐసీయూలో చికిత్స పొందుతున్న కార్మికులు దేవ్‌బాగ్, ముకేశ్ గౌడ్‌లను ఆయన పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యాన్ని అందించాలని వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.



బాధితుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

హిందూ అంటే మతం కాదు ఓ ధర్మం

గాజువాక, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హిందూ అంటే మతం కాదని ఓ ధర్మమని ప్రముఖ స్వామీజీ ఓలేటి సత్యనారాయణ అన్నారు. గాజువాక లంకా మైదానంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ మహా సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందూ ఆలయాలపై వచ్చిన ఆదాయాన్ని సదరు ఆలయాల అభివృద్ధికే వినియోగించాలని కోరారు. జనవరి ఐదున విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి హైందవ శంఖారావం సభకు లక్షలాది మంది హాజరు కావాలని పిలుపునిచ్చారు. బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు ఎంతో కృషి చేస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ ధర్మం వైపు నడవాలని ఆకాంక్షిచారు. కార్యక్రమంలో ప్రతినిధులు బాటా శ్రీను, సత్యనారాయణ, ఎస్.నూకరాజు, రమణ, భువనేశ్వరి, పావని, రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పట్ల ఉక్కు యాజమాన్య వైఖరి దారుణం

ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు రామచంద్రరావు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉక్కు ఉద్యోగుల పట్ల యాజమాన్యం దారుణంగా వ్యవహరిస్తుందని ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంటులో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పండగ సమయంలో కూడా ఉక్కు యాజమాన్యం జీతాలు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతుందని వాపోయారు. పెండింగ్‌లో ఉన్న 185 శాతం జీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో నాయకులు కారు రమణ, రాజు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.



..మాట్లాడుతున్న నీరుకొండ రామచంద్రరావు

గ్యాస్ సిలిండర్ల కోసం నిరీక్షణ

- బుకింగ్‌కు తగ్గట్టుగా సరఫరా కాని వైనం
- రోజుకు ఒక్క లోడ్ పంపుతున్న కంపెనీలు
- సిబ్బందిని నిలదీస్తున్న వినియోగదారులు

మల్కాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీ, ఇండస్, భారత తదితర ఆయిల్ పరిశ్రమల నుంచి ఆశించిన స్థాయిలో వంట గ్యాస్ సిలిండర్లు సరఫరా కావడం లేదు. దీంతో వినియోగదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆయా కంపెనీలకు చెందిన ఏజెన్సీలకు రెండేసి లోడుల చొప్పున సిలిండర్లను సరఫరా చేసే కంపెనీలు ప్రస్తుతం ఒక్క లోడు మాత్రమే పంపుతుండడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. తక్కువ సిలిండర్లు వస్తుండడంతో బుక్‌చేసుకున్న వారికి ప్రయారిటీ ప్రకారం సిబ్బంది పంపిణీ చేస్తున్నారు. దీంతో అత్యవసరంగా అవసరమైన వారు సిలిండర్‌లు రాక ఇక్కట్లు చవిచూస్తున్నారు. బుక్ చేసిన ఐదారు రోజులు దాటినా సిలిండర్లు రాకపోవడంతో ఏజెన్సీ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. తమకు గ్యాస్ ఎందుకు రాలేదని సిబ్బందిని నిలదీస్తున్నారు. దీంతో యజమాన్యాలకు ఏం చేయాలో పాలు పోవడం లేదు.



ఏజెన్సీ సిబ్బందిని ప్రశ్నిస్తున్న వినియోగదారులు

సాధారణంగా ఒక్కో లారీకి 300 గ్యాస్ సిలిండర్లు వస్తుంటాయి. ప్రతిరోజూ ఏజెన్సీల పరిధిలో 500కు పైగా బుకింగ్‌లు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఒక లోడు మాత్రమే వస్తుండడంతో అందరికీ పంపిణీ సాధ్యం కావడం లేదంటున్నారు. ఈనెల 15 నుంచి ఇప్పటి వరకు సుమారు మూడువేల మందికి సిలిండర్లను సరఫరా చేయాల్సి ఉందని చెబుతున్నారు. దీనికి తోడు వినియోగదారులలో చాలా మందికి ఈకేవైసీ కాలేదు. దీని వలన సిలిండర్ల పంపిణీ సాధ్యం కావడం లేదంటున్నారు. మరి కొంతమందికి సబ్సిడీ డబ్బు అందలేదని గ్యాస్ ఏజెన్సీల చుట్టు తిరుగుతున్నారు. ఏదీఏమైన ఇటీవల గ్యాస్ వినియోగదారులకు కష్టాలు ఎక్కువయ్యాయని వాపోతున్నారు. చలికాలం కావడంతో గ్యాస్ వినియోగం పెరిగిందని, బుకింగ్ సంఖ్య పెరిగిందని సిబ్బంది చెబుతున్నారు. ఇదిలావుండగా గ్యాస్‌కంపెనీలలో కూడా ఈ సీజన్‌లో గ్యాస్ లోడింగ్ కూడా అలస్యంగానే సాగుతుంటుందని కంపెనీ సిబ్బంది పేర్కొంటున్నారు. ఈ విషయం పై ఏజెన్సీల యజమాన్యాలతో సమావేశాలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి సంబంధిత కంపెనీలు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వెలమ సామాజికవర్గానికి న్యాయం చేస్తాం

- ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొప్పుల వెలమ కార్పొరేషన్ ద్వారా వెలమ సామాజిక వర్గానికి సేవలందించేందుకు కార్పొరేషన్ డైరెక్టర్ సీహెచ్ రామ్మోహన్ నాయుడు కార్యాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) పేర్కొన్నారు. గ్రేటర్ 59వ వార్డు మాజీ సైనికుల కాలనీ సమీపంలో గల లేబర్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యాలయంను ఆయన సోమవారం ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయాలనే ఆలోచనతో కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని ఇచ్చిందని, దానికి న్యాయం చేస్తానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, లావణ్య, మితిరెడ్డి శంకర్, పొత్తబత్తుల శ్రీను, బీజేపీ నేత గురుమూర్తి, గేదల రమణ, లక్కరాజు రామకృష్ణ, శంకర్, పైడిరాజు, వరప్రసాద్, వెంకట్రావు పాల్గొన్నారు.

ఈఎన్‌సీ, హోమీబాబా ఆస్పత్రి మధ్య ఎంఓయూ



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

విశాఖపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పు నౌకాదళం, హోమీ బాబా ఆస్పత్రి యాజమాన్యం మధ్య సోమవారం అవగాహన ఒప్పందం జరిగింది. నేవీ ఉద్యోగులకు కేన్సర్ సంబంధిత వ్యాధులకు పరీక్షలు, చికిత్సను నగదు రహితంగా చేయడానికి ఇరు సంస్థలు అంగీకారానికి వచ్చి, ఒప్పందం కుదుర్చుకున్నాయి.

26న అయ్యప్ప మండల పూజ

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ అయ్యప్పస్వామి వారి ఆలయంలో మండల పూజ ముగింపోత్సవాలను ఈ నెల 26న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఆ రోజు ఆలయంలో అయ్యప్పకు పుష్పాభిషేకం, బలిహరణ, ధ్వజారోహణ పూజ, గుడిసేవ, మహా హారతి, తదితర కార్యక్రమాలను చేపడతామని పేర్కొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో అప్పన్నపాలెం చిన్నారుల ప్రతిభ



సాధించిన పతకాలతో అప్పన్నపాలెం చిన్నారులు

వేపగుంట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కిక్ బాక్సింగ్‌లో అప్పన్నపాలెం చిన్నారులు ప్రతిభ చూపారు. కోల్‌కత్తాలో ఈనెల 20,21 తేదీల్లో జరిగిన అమెచ్యూర్ కె-1 ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్‌లో అండర్ 14లో పి.చేతన్‌శ్రీ, అండర్ 16లో జె.సిద్ధార్థ స్వర్ణ పతకాలు సాధించారు. అండర్ 19 విభాగంలో బీఈఎస్ ప్రసాద్. పి.గణేష్‌కు రజత పతకాలు, బి.సిద్దు, ఎ.ఈశ్వరరావుకు కాంస్య పతకాలు లభించాయని కార్యదర్శి బి.భీమ్‌రావు, హేమంత్‌కుమార్ తెలిపారు.

పైపులైన్‌కు మరమ్మతులు చేసిన సిబ్బంది

ఎన్ఏడీ జంక్షన్, డిసెంబరు 23: జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్‌లో కొండవాలు ప్రాంత వాసులకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సుసర్లకాలనీలో లీకైన వాల్వ్‌కు ఈఈ కనకారావు ఆదేశాల మేరకు డీఈ వీరయ్య పర్యవేక్షణలో సిబ్బంది మరమ్మతులు చేశారు. దీంతో యధావిధిగా నీటి సరఫరా జరిగింది.

బాలబాలికల జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక రేపు

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో జనవరి మూడో తేదీ నుంచి జరగనున్న 50వ అంతర్ జిల్లాల బాలబాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ఈ నెల 25న ఎంపిక చేయనున్నట్లు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గాజువాక హైస్కూల్ గ్రౌండ్‌లో ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచే జరిగే ఈ ఎంపిక పోటీలకు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఛైర్మన్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హాజరవుతారన్నారు. 20 ఏళ్లలోపు బాలబాలికలు ఈ ఎంపిక పోటీలకు అర్హులని వారు పేర్కొన్నారు. బాలురు 70 కిలోలు, బాలికలు 65 కిలోలలోపు బరువు వుండాలని, వయసు ధ్రువీకరించే ఒరిజినల్ ఆధార్ కార్డుతో ఈ పోటీలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 7680005666 సెల్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

చదరంగం విజేతలు రుత్విక్, అఖిల్



విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విశాఖ వేలీ స్కూల్‌లో శ్రీ చెస్ అకాడమీ నిర్వహించిన జానకమ్మ స్మారక జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో ఎం.రుత్విక్, బీవీఎస్.అఖిల్ ప్రథమ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. సోమవారం జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమంలో విశాఖ వేలీ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో చెస్ సంఘం ప్రతినిధి ఆర్.బాబురావు, నిర్వాహకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విజయ్ హజారే ట్రోఫీలో మిజోరాంపై ఉత్తరప్రదేశ్ విజయం

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ తొమ్మిది వికెట్ల తేడాతో మిజోరాంపై విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన మిజోరాం 34.3 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటైంది. మోహిత్ జంగ్రా అర్ధ సెంచరీ (70), ధన్కుమ (24) మినహా మిగిలినవారు విఫలమయ్యారు. ఉత్తరప్రదేశ్ బౌలర్లు శివం మావి ఐదు వికెట్లు, మెహిసిన్ ఖాన్ మూడు వికెట్లు పడగొట్టి మిజోరాం బ్యాటింగ్‌ను దెబ్బతీశారు. సాధారణ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరప్రదేశ్ 20.3 ఓవర్లలో కేవలం ఒక వికెట్ కోల్పోయి 144 పరుగులు చేసి విజయం సొంతం చేసుకుంది. ఓపెనర్లు అభిషేక్ గోస్వామి (47) ఆర్యన్ జుయల్ అజేయ భారీ అర్ధ సెంచరీ (86 నాటౌట్) సాధించి జట్టుకు సునాయాస విజయాన్నందించారు.

సమస్యలపై నాలుగు అర్జీలు

జ్ఞానాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక జోన్-4 కార్యాలయంలో సోమవారం జరిగింది. టౌన్ ప్లానింగ్, నీటిసరఫరా విభాగాలకు సంబంధించి ఒక్కొక్కటి, ప్రజారోగ్యంపై-2 ఫిర్యాదులు వచ్చాయి. ఏఎంఓహెచ్ కృష్ణంరాజు, రెవెన్యూ ఆఫీసర్ రతన్‌రాజు, అప్పలరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చర్చిలకు క్రిస్మస్ శోభ

కంచరపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ప్రార్థనల కోసం కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో చర్చిలకు విద్యుత్ కాంతులతో సొబగులద్దారు. మంగళవారం క్రిస్మస్ ఈవ్‌లో భాగంగా అర్ధరాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. కంచరపాలెం జాతీయ రహదారి, ఐటీఐ జంక్షన్, ఆర్పీపేట, రాంజీ ఎస్టేట్, బర్మాక్యాంప్ తదితర ప్రాంతాల్లోని చర్చిలలో ప్రార్థనలు జరుగుతాయి. ఎయిర్‌పోర్టు బాప్టిస్ట్ చర్చి, జీసస్ హీల్స్ చర్చిలకు విద్యుత్ దీపాలంకరణ చేశారు.

ఎస్టేట్ అధికారికి శుభాకాంక్షలు

అక్కయ్యపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నరసింహనగర్‌లోని రైతుబజారుకు నూతన ఈవోగా బాధ్యతలు స్వీకరించిన కొండబాబును రైతు సంఘం కార్యదర్శి కల్యాణ్‌దాస్, రైతులు, డ్వాక్రా సంఘాల వ్యాపారులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బజారు సహాయకుడు ఆర్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామానుజన్ సేవలు అనన్యం

డాబాగార్డెన్స్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ అందించిన సేవలు అనన్యమని జీవీఎంసీ ఆర్‌బీఎంయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకర్ అన్నారు. 31వ వార్డులోని ఆ పాఠశాలలో సోమవారం రామానుజన్ జయంతి వేడుకలు నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామానుజన్ గణిత శాస్త్రంలో కనుగొన్న పరిశోధనలు, ఆవిష్కరణలను తెలియజేశారు. ఈ సందర్భంగా పోస్టర్ ప్రెజెంటేషన్, విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయిని సాయివిమలకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెట్రోలుపోసి నిప్పంటించిన ఘటనలో చికిత్స పొందుతూ మహిళ మృతి

సీతంపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళపై పెట్రోలు పోసి నిప్పంటించడంతో తీవ్రంగా గాయపడిన ఆమె చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అక్కయ్యపాలెం శ్రీనివాసనగర్‌లో అంగన్వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న రహీమున్నీసా బేగంకి గోపాలపట్నంకి చెందిన సంగీతతో స్నేహం ఏర్పడింది. వారి మధ్య నగదు లావాదేవీలు కుదిరాయి. ఏం జరిగిందో గాని ఈ నెల 4న సంగీత అక్కయ్యపాలెంలోని అంగన్వాడీ కేంద్రానికి వచ్చి సమీపంలో ఉన్న ఆటోలో కూర్చుని రహీమున్నీసా బేగంకి ఫోను చేసి పిలిచింది. ఇద్దరూ ఆటోలో మాట్లాడుకుంటుండగా సంగీత తనతో సీసాలో తెచ్చుకున్న పెట్రోలును రహీమున్నీసా బేగంపై పోసి నిప్పంటించింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న రహీమున్నీసా సోమవారం మృతి చెందింది. ఇప్పటికే సంగీతను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు.

బాబోయ్...లలితాకాలనీ..!

» భారీ వాహనాలతో ఎగుమతి, దిగుమతులు » నిత్యం గంటల తరబడి ట్రాఫిక్ జామ్



కాలనీలోని ప్రధాన రహదారికి ఇరువైపులా నిలిపిన వాహనాలు

డాబాగార్డెన్స్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని డాబాగార్డెన్స్ లలితాకాలనీలో రాకపోకలు అసహనం కలిగిస్తాయి. లలితకాలనీలోని రవాణా కార్యాలయాలు ఎక్కువ. నిత్యం ఎగుమతి, దిగుమతులు (లోడింగ్..ఆన్‌లోడింగ్) జరుగుతుంటాయి. ఈ కారణంగా రోడ్డు సగానికి పైగా దుకాణదారులు వచ్చేయడంతో రాకపోకలు కష్టతరమవుతుంది. సెంటర్ పాయింట్ నుంచి జిల్లా జడ్జి కోర్టుకు వెళ్లేందుకు సింగ్‌హోటల్ జంక్షన్ నుంచి డాబాగార్డెన్స్ వెళ్లేందుకు ఈ రహదారిని ఎక్కువగా వాహనదారులు వినియోగిస్తుంటారు. అయితే ఇక్కడ ఇష్టానుసారంగా వాహనాలు నిలిపివేయడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ట్రాఫిక్ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. సాయంత్రం వేళలో ట్రాఫిక్ జామ్ మరింత ఎక్కువగా ఉంటోందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకుని ఈ ప్రాంతంలో రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని, వాహనాలను నిరోధించాలని కోరుతున్నారు.

కనక మహాలక్ష్మి అమ్మవారి హుండీ ఆదాయం రూ.78.79 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

జగదాంబ కూడలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి ఆలయంలో సోమవారం అమ్మవారి హుండీ లెక్కింపు చేపట్టారు. నవంబరు 13 నుంచి డిసెంబరు 23 వరకు భక్తులు హుండీల్లో వేసిన కానుకల ఆదాయం రూ.78,78,841 సమకూరినట్లు ఈవో కె.శోభారాణి తెలిపారు. బంగారం 59 మిల్లీగ్రాములు, వెండి 690 గ్రాములు వచ్చిందన్నారు. విదేశీ కరెన్సీ కూడా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జేఈవో తిరుమలేశ్వరరావు, వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది, శ్రీహరిసేవ, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

మూణ్ణాళ్ల ముచ్చటగా 48-ఎస్ బస్సు



మాధవధార రూట్‌లో ఇదొక్కటే బస్సు...

మురళీనగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఆర్టీసీ ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. మాధవధార ఉడాకాలనీ నుంచి కైలాసపురం, పోర్టు ఆసుపత్రి మీదుగా ఆర్టీసీ కాంప్లెక్సు, జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ వరకు ఒక్క బస్సు (48ఎ) మాత్రమే నడుస్తోంది. అదే నంబరుతో వాల్తేర్ డిపో నుంచి నాలుగు బస్సులు తిప్పుతున్నారు. ప్రతి అరగంటకూ ఓ బస్సు వస్తుంది. మధ్యాహ్న వేళల్లోనూ, రాత్రి సమయాల్లో 8 గంటలు దాటితే స్థానికులకు ప్రైవేటు వాహనాలే దిక్కు.

ఆ బస్సు... తుస్; కొత్తగా ఈ ఏడాది సెప్టెంబరులో వేసిన 48-ఎస్ బస్సు సర్వీసులు తక్కువగా ఉన్నాయన్న నెపంతో నడపడం లేదు. దీంతో ప్రయాణికుల వెతలు ఎప్పటిలాగే మారాయి. గంటలకొద్దీ బస్సు కోసం పడిగాపులు పడుతున్నారు. ఆర్టీసీ జనరల్ బస్ పాసులు, రూట్ బస్ పాస్‌లు తీసుకున్న విద్యార్థులు ముందుగా డబ్బులు చెల్లించి ఇప్పుడు ఉసూరుమంటున్నారు. కొత్త 48-ఎస్ బస్సు నగర ప్రాంతాల్ని కలుపుతూ తిరిగేది. ఆర్కే బీచ్ నుంచి సింహాచలం వరకు ఏర్పాటు చేసిన ఈ బస్ పోర్టు క్వార్టర్సు, కైలాసపురం, మురళీనగర్, ఎన్‌జీజీఓస్ కాలనీ ప్రాంతాల మీదుగా ఎన్ఏడీ నుంచి సింహాచలం చేరేది. ఇపుడు ఈ బస్సు సర్వీసులు తక్కువ అయ్యాయని ఆపేశారు. దీంతో ఒక్కటే బస్సు దిక్కుగా మారింది. మురళీనగర్, కైలాసపురం, మాధవధార ప్రాంతాల ప్రజలు తిరిగి ఇక్కడి ప్రయాణికుల కోసం ప్రవేశ పెట్టిన కొత్త 48-ఎస్ రూట్ బస్సును పునరుద్ధరించాలని కోరుతున్నారు.

'ఉత్తర నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి సత్వర చర్యలు'



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు

మురళీనగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి సత్వర చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రచారానికే ప్రాధాన్యత ఇచ్చిన ఈ నియోజకవర్గంలో అభివృద్ధి పక్కదారి పట్టిందని విమర్శించారు. సోమవారం 51వవార్డు జీవీఎంసీ మాధవస్వామి కల్యాణమండపంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. నగర వ్యాప్త గుర్తింపు పొందిన మురళీనగర్ ప్రాంతాల్లో మురికివాడలు ఉన్నాయన్న నిజం బయట ప్రపంచానికి తక్కువగా తెలుసన్నారు. కొండవాలు నివాసిత ప్రాంతాలు కూడా అధికంగా ఉన్న ఈ నియోజకవర్గంలో పేదలకు రక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. 50వ వార్డు సాయిరాంనగర్, 51వ వార్డు ఏకలవ్య కాలనీ లాంటి మురికి వాడల్లో దీర్ఘకాలిక సమస్యలపై సత్వర పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రాంతంలో నిషేధిత భూముల జాబితా విషయంలో రెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదులపై దృష్టి సారిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. సదస్సులో తహసీల్దారు రమేష్, జోన్-5 జెడ్సీ బి.రాము, ఇతర అధికారులు, 50, 51 వార్డుల బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు హాజరయ్యారు.

పవర్ లిఫ్టింగ్‌లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులు

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి అండర్-17 బాలుర, బాలికల పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో ఉమ్మడి విశాఖ లిఫ్టర్లు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. విజయవాడలో జరిగిన ఈ టోర్నీలో బాలుర విభాగంలో సీహెచ్.కుమారస్వామి (53 కిలోలు), వి.దీనరాజు (101 కిలోలు) స్వర్ణ పతకాలు, పి.సూర్య సాకేత్ (66 కిలోలు) కాంస్య పతకం, ఎం.నాగరాజు (93 కిలోలు) కాంస్య పతకం సొంతం చేసుకున్నారు. బాలికల విభాగంలో ఎ.పూర్వజ (52 కిలోలు) స్వర్ణ పతకం, ఎం.లక్ష్మీదేవి (47 కిలోలు), పి.సాయి సంజనశ్రీ (57 కిలోలు), ఎం.అమృతవల్లి (69 కిలోలు) కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులతోపాటు కోచ్‌గా వ్యవహరించిన జి.దేవిని ఎస్‌జీఎఫ్ ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి దేముడు, ఇతర ప్రతినిధులు ఎంవీ నాగేశ్వరరావు, వి.కొండబాబు తదితరులు అభినందించారు.

ఆనందరావు మృతిపై విచారణకు వినతి

మహారాణిపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉజ్బెకిస్థాన్‌లో మృతిచెందిన కె.ఆనందరావు విషయమై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని ఆయన కుటుంబ సభ్యులు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను సోమవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఆనందరావు అక్కడి యాజమాన్యం వెట్టి చాకిరీని వ్యతిరేకించడంతో చంపించి ప్రమాదం జరిగినట్లు చిత్రీకరించారని ఆరోపించారు. నవంబరు 2న ఆనందరావు మరణిస్తే మరుసటి రోజు తెలిపి 8న మృతదేహాన్ని పంపారని తెలిపారు. ఆయన మృతిచెందడానికి రెండు రోజుల ముందు వీడియో పంపి అక్కడి దుర్భర స్థితిని తెలియజేస్తూ, ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. వారి వెంట టీఎన్‌టీయూసీ అధికార ప్రతినిధి బలిరెడ్డి సత్యనారాయణ, వెంకటరమణ, ఆనందరావు భార్య సురేఖ, పిల్లలు, బంధువులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌కు ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థులు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, ఇతర ప్రముఖులు

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల, మహిళల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ జట్టుకు నగరానికి చెందిన ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థులు బి.రవికుమార్, కాజల్ సింగ్, డి.చరణ్ నాయక్ ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ నెల 26 నుంచి భువనేశ్వర్‌లో జరిగే ఈ మీట్ పురుషుల 100 మీటర్లు, 200 మీ. 4+100 రిలే పరుగు ఈవెంట్లలో బి.రవికుమార్, 400 మీ., 800 మీ., 1500 మీ. పరుగు ఈవెంట్లలో డి.చరణ్ నాయక్, మహిళల 800 మీ., 1500 మీ. పరుగు ఈవెంట్లలో కాజ సింగ్ ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ సందర్భంగా ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు సోమవారం తన కార్యాలయంలో విద్యార్థిఅథ్లెట్లను అభినందించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ స్పోర్ట్సు వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ఎన్ పాత్రుడు, హెచ్‌వోడీ డాక్టర్ సీహెచ్ఆర్ఎస్.భూషణరావు, డాక్టర్ పి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల కోసం నేరుగా కలవండి: తహసీల్దార్

సీతమ్మధార, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలు, వివిధ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమకు కావాలసిన ధ్రువపత్రాల కోసం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో నేరుగా తనను సంప్రదించవచ్చని, వారి అవసరం మేరకు తక్షణమే పరిశీలించి జారీ చేస్తానని అర్బన్ తహసీల్దార్ ఎం.రమేష్ సూచించారు. సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మద్దిలపాలెంలో భూ ఆక్రమణ జరిగినట్లు ఓ వ్యక్తి తనకు ఫిర్యాదు ద్వారా దరఖాస్తు సమర్పించారని, పలు ఉద్యోగాల్లో ప్రవేశానికి, ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన ధ్రువపత్రాల కోసం ఇంకొందరు దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. వాటిని పరిశీలించి త్వరితగతిన పత్రాలు జారీ చేస్తానని తహసీల్దార్ తెలిపారు.

సామాజిక భవనం ప్రారంభోత్సవంలో లడాయి



ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేస్తున్న ఇరువర్గాలు

జ్ఞానాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 41వ వార్డు పరిధిలోని జేఎన్ఎన్ఎంయూఆర్ఎం కాలనీలో స్థానికుల అభ్యర్థన మేరకు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా చొరవతో రూ.49.60 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఏళ్లతరబడి ఇక్కడ నివాసం ఉంటున్న తమకు సామాజిక భవనం లేక అనేక ఇబ్బందులు పడ్డామని, కార్పొరేటర్ పూర్ణిమా తమ కష్టాలు తీర్చారని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోడిగుడ్ల శ్రీధర్, జోనల్ కమిషనర్ బి.రాము, ఈఈ ప్రసన్నరెడ్డి, ఏఈ సతీష్, బెహర మధుబాబు, ఆంథోని శేఖర్, సంజీవరావు, నాయకులు పాల్గొన్నారు.

నేతల పరస్పర ఆరోపణలు

వార్డులో కూటమి నాయకులు ప్రతి పనికి వసూళ్లకు పాల్పడుతున్నారని వార్డు కార్పొరేటర్ పూర్ణిమా ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. అందుకు ఆధారాలు ఉన్నాయని, బాధ్యులపై చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. పూర్ణిమా వ్యాఖ్యలను వార్డు టీడీపీ అధ్యక్షుడు బెహర మధుబాబు ఖండించారు. కూటమి నాయకులు ఎలాంటి వసూళ్లకు పాల్పడలేదని, వారు చెబుతున్నట్లు ఆధారాలు ఉంటే బహిర్గతం చేయాలని, అలా నిరూపిస్తే రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకొంటామని అన్నారు. లేకుంటే వారు ఎలాంటి బాధ్యత వహిస్తారో తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే సమక్షంలోనే వాద ప్రతివాదాలు జరగడం గమనార్హం.

ఘాట్ రోడ్డులో ఆకతాయిల ఆగడాలు



పూర్ణామార్కెట్ వైపు ఘాట్ రోడ్డు మార్గం

పూర్ణామార్కెట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పూర్ణామార్కెట్ వైపు సత్యనారాయణ స్వామి ఘాట్ రోడ్డు మార్గంలో ఆకతాయిల ఆగడాలతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. చీకటి పడితే చాలు.. ఇక్కడ మందుబాబులు వీరంగం చేస్తున్నారని చెబుతున్నారు. పూర్ణామార్కెట్ వైపు ఘాట్ రోడ్డు ముఖద్వారం వద్ద దేవస్థానం అధికారులు గేటు ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో ఇది తెరచి ఉంటుంది. దీంతో ఈ మార్గంలో మందు పార్టీలు చేసుకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ మార్గం కేజీహెచ్‌కు వెళ్లేందుకు ఉపయుక్తంగా మారింది. పూర్ణామార్కెట్ పరిసర ప్రాంతాలకు చెందిన కొందరు మహిళలు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించేందుకు ఈ మార్గం గుండా వెళ్లే సందర్భంలో మందుబాబులు వారిపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గంజాయి, మత్తుపదార్థాలు వినియోగించే వారికి ఈ మార్గం అడ్డాగా మారింది. గతంలో పోలీసులు గస్తీ తిరగడంతో వీరి ఆగడాలకు కళ్లెం పడింది. కొద్దిరోజులుగా పోలీసులు ఇటువైపు చూడకపోవడంతో పరిస్థితి యథాస్థితికి వచ్చింది. ఘాట్ రోడ్డు మార్గంలో మద్యం సీసాలు, చెత్తాచెదారంతో నిండిపోవడం పట్ల భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైల్వే జోన్‌పై తాత్సారం

... 5వ పేజీ తరువాయి

దగ్గరగా ఉన్న ప్రాంతాలను తూర్పు కోస్తా జోన్‌లోని ఖుర్దా డివిజన్‌లో కలుపుతామని పేర్కొంది. విజయనగరం జిల్లాలో కొత్తవలస నుంచి మొదలయ్యే కేకే లైన్‌ను కిరండోల్ వరకూ కొత్తగా ఏర్పాటు చేసే రాయగడ డివిజన్‌లో కలుపుతామని ప్రకటించారు. విచిత్రం ఏమిటంటే..విశాఖలో కొత్త జోన్ ఏర్పాటు చేయకుండా, వాల్తేరు డివిజన్ రద్దు కాకుండానే రాయగడలో కొత్త డివిజన్ కార్యాలయం నిర్మాణం ప్రారంభించారు. అక్కడ చూపిన చొరవ ఇక్కడ కనిపించకపోవడం గమనార్హం. ఆదాయ సముపార్జనలో వాల్తేరు డివిజన్ టాప్-5లో ఒకటిగా ఉంది. ఇది రద్దయితే సరకు రవాణా ఆదాయం దక్షిణ కోస్తా జోన్‌కు కాకుండా తూర్పు కోస్తాకు పోతుంది. ఒత్తిళ్లకు లొంగి జోన్ ఇవ్వడమే తప్ప విశాఖను ఉన్నత స్థానంలో నిలపాలనే ఉద్దేశంతో కేంద్ర రైల్వే పెద్దలు ఏ పనీ చేయడం లేదు.

అడ్డంకులు తొలగుతున్నాయ్

... 5వ పేజీ తరువాయి

మార్గాన్ని ఓపెన్ చేయలేదు. దాంతో బీచ్‌లోకి ఒక్కటే మార్గం కావడంతో వారాంతపు రోజుల్లో రద్దీ పెరిగి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను మీడియా ఎత్తిచూపడంతో కూటమి నేతలు స్పందించారు. పర్యాటక శాఖ అధికారులతో సంప్రతించి దక్షిణ మార్గం ప్రారంభించాలని సూచించారు. ఆ పనులన్నీ పూర్తి కావడంతో విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, జేసీ మయూర అశోక్ కలిసి సోమవారం పునఃప్రారంభించారు. ఈ మార్గంలో బీచ్ వ్యూ బాగుంటుందని సంతోషం వ్యక్తంచేశారు.

నియోజకవర్గ ఎమ్మెల్యే లేకుండానే...

రుషికొండ.. భీమిలి నియోజకవర్గంలో ఉంది. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు లేకుండా, ఆయన నగరంలో లేనప్పుడు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడంపై ఆయన అనుచరులు అసంతృప్తి వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఈ విషయమై అధికారులపై మండిపడినట్టు తెలిసింది. వివాదాలకు తావివ్వకుండా అంతా అందుబాటులో ఉన్నప్పుడు చేసి ఉంటే బాగుండేదని అధికారులకు చెప్పినట్టు సమాచారం.

టీడీఆర్‌ల జారీపై విజిలెన్స్

... 5వ పేజీ తరువాయి

జారీచేసినట్టు వివరించారు. వాటి వివరాలను సభ్యులందరికీ అందజేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఒక్కో టీడీఆర్‌కు సంబంధించి కనీసం వంద పేజీల ఫైల్ ఉంటుందని, ఒకేసారి గత పదేళ్లలో జారీచేసిన 1,035 టీడీఆర్‌ల జాబితా తయారుచేయడం ఎలా సాధ్యమవుతుందని టౌన్‌ప్లానింగ్ అధికారులు గగ్గోలు పెడుతున్నారు. ముందుగా అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా ఉన్నంతలో టీడీఆర్‌ల వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

టీడీఆర్‌లపై విజిలెన్స్ ఆరా

జీవీఎంసీలో టీడీఆర్‌లపై పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతుండడం, పత్రికల్లో వరుస కథనాలు వస్తుండడంతో విజిలెన్స్, సీఐడీ విభాగాల అధికారులు కూడా దీనిపై దృష్టిసారించినట్టు తెలిసింది. ఇప్పటికే జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వెళ్లి కొన్ని టీడీఆర్‌లకు సంబంధించిన సమాచారం సేకరించినట్టు తెలిసింది. టీడీఆర్ జారీచేసిన కొన్ని స్థలాలకు సంబంధించిన ఫైళ్లను టౌన్‌ప్లానింగ్ అధికారులు నుంచి తీసుకువెళ్లినట్టు చెబుతున్నారు. పదేళ్లలో జారీచేసిన టీడీఆర్‌ల సమాచారాన్ని క్రోడీకరించే పనిలో ఉన్న అధికారులకు విజిలెన్స్, సీఐడీ అధికారులు అదే అంశంపై ఆరా తీస్తుండడంతో నిద్రపట్టడం లేదు. ఏ క్షణంలో ఎలాంటి పరిస్థితి ఎదురువుతోందోనని టీడీఆర్‌ల జారీలో అవకతవకలకు పాల్పడి నవారు ఆందోళన చెందుతున్నారు.

బ్యాంకుకు బురిడీ

... 5వ పేజీ తరువాయి

ఖాతాకు రూ.14,69,000 బదిలీ చేయించుకున్నాడు. డబ్బు డ్రా చేసుకుని తీసుకువద్దామంటూ సీఎస్‌బీ బ్యాంకు ప్రతినిధులు ఇద్దరిని సుజాత నగర్‌లోని ఫెడరల్ బ్యాంకుకు తీసుకువెళ్లాడు. వారిని బయట కూర్చోబెట్టి బ్యాంకులోకి వెళ్లిన చిరంజీవి తన ఖాతాలోని డబ్బును డ్రా చేసుకుని...మరొకరితో కలిసి ఉడాయించాడు. సీఎస్‌బీ బ్యాంకు ప్రతినిధులు కొద్దిసేపు వేచిచూసి ఫెడరల్ బ్యాంకులోకి వెళ్లి ఆరా తీయగా చిరంజీవి అనే వ్యక్తి ఎటువంటి బంగారం తాకట్టు పెట్టలేదని తేలింది. దీంతో తమను మోసగించాడని సీఎస్‌బీ సిబ్బంది గ్రహించారు. ఈ మేరకు ద్వారకా పోలీసులకు బ్యాంకు ఆపరేషన్ మేనేజర్ పద్మవీణా ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేంద్ర కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. తమరాన చిరంజీవి వివరాలు తెలిసినవారు ఎవరైన ద్వారకా సీఐ శ్రీనివాసరావు (ఫోన్ నంబర్ 7995093604), ఎస్ఐ ధర్మేంద్ర (8555813894)కు సమాచారం తెలియజేయాలని కోరారు. చిరంజీవి, అతడికి సహకరించిన మరొకరి ఫొటోలను విడుదల చేశారు.

రక్షిత్ ఫార్మాలో ప్రమాదం

... 5వ పేజీ తరువాయి

స్పృహ కోల్పోయి ఉన్నారు. వారిని బ్లాక్-2 నుంచి కిందకు వస్తూ కెమిస్టు నాగేశ్వరరావు గమనించారు. అప్పటికే దేవ్‌బాగ్ అపస్మారక స్థితిలోకి జారుకోగా, ఉగ్రెసర్ గౌడ ఫిట్స్ వచ్చినట్టు కాళ్లు, చేతులు కొట్టుకుంటున్నారు. వెంటనే ఇద్దరికీ పరిశ్రమలోనే ఆక్సిజన్ ఏర్పాటుచేసి అనంతరం గాజువాక సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. వీరిలో దేవ్‌బాగ్ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రొడక్షన్ బ్లాక్-1లో మొత్తం తొమ్మిది మంది కార్మికులు పనిచేస్తున్నారు. తెల్లవారుజామున ఐదున్నర గంటల సమయంలో మిగతా ఏడుగురు షిఫ్ట్ చేంజింగ్ కోసమని సెక్యూరిటీ వద్దకు వెళ్లి పంచింగ్ చేయడంలో నిమగ్నమయ్యారు. అదే సమయంలో బ్లాక్-1లో రియాక్టర్ నుంచి హైడ్రోజన్ సల్ఫైడ్ వాయువు రియాక్టర్‌కు చెందిన స్క్రబ్బర్ నుంచి లీకై ఉండవచ్చునని, వాటిని పీల్చడం వల్ల అక్కడ ఉన్న ఇద్దరూ అస్వస్థతకు గురై ఉంటారని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఉగ్రెసర్, దేవ్‌బాగ్‌లు షిఫ్ట్ ముగిసిన తరువాత కాసేపు విశ్రాంతి తీసుకోవడానికి అక్కడ కూర్చుని ఉంటారని తోటి కార్మికులు చెబుతున్నారు. వాయువులు ప్రొడక్షన్ బ్లాక్‌లో ఎక్కడ నుంచి లీకయ్యాయో గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అధికారులు

ప్రమాదం చోటుచేసుకున్న రక్షిత్ డ్రగ్స్‌లోని ప్రొడక్షన్ బ్లాక్‌ను పరిశ్రమల తనిఖీ అధికారులు జె.శివశంకర్‌రెడ్డి, జేవీఎస్ నారాయణరావు, తహసీల్దార్ ఎస్‌వీ అంబేద్కర్, సీఐ మల్లికార్జునరావు, పీసీబీ, అగ్నిమాపక శాఖ అధికారులు పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందో యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. వాయువులు ఎక్కడ లీకయ్యాయో తెలుసుకుంటున్నారు.

బడ్జెట్ ముసాయిదాకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

... 5వ పేజీ తరువాయి

వివిధ పద్దుల కింద అన్ని విభాగాల ద్వారా రూ.4,554.27 కోట్లు ఖర్చు చేయబోతున్నట్టు పేర్కొన్నారు. అయితే నగరంలో పచ్చదనం పెంచాల్సి ఉందని అందుకోసం హార్టికల్చర్ విభాగానికి అదనపు కేటాయింపులు జరపాలని సూచించిన కమిటీ సభ్యులు...బడ్జెట్ ముసాయిదాను ఆమోదించాలని మేయర్‌ను కోరారు. దీంతో సభ్యులు సూచించిన సవరణలు చేసిన తర్వాత కౌన్సిల్‌లో ముసాయిదాను ప్రవేశపెట్టాలని సూచిస్తూ మేయర్ ముసాయిదాకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్ల వాడకం

వెంకోజీపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ నిరోధించాలని, ఒక్కసారి మాత్రమే వినియోగించే సామర్థ్యమున్న కవర్లను అసలే వాడకూడదని పదే పదే జీవీఎంసీ అధికారులు ప్రచారం చేస్తున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. 16వ వార్డులోని హెచ్‌బీకాలనీ సులభ్ కాంప్లెక్స్, అదే మార్గంలోని కృష్ణా కళాశాల వద్ద అల్పాహార విక్రయశాల, తోపుడుబండ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల వద్ద నిషేధిత ప్లాస్టిక్ కవర్లను యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. వచ్చేనెల 1 నుంచి ప్లాస్టిక్ కవర్లను ఎవరి చేతిలో కనిపించినా అపరాధ రుసుము వసూలు చేస్తామని హెచ్చరించినా.. ఉత్తుత్తి ప్రచారంగా తేలిగ్గా కొట్టిపారేస్తున్నారు. పారిశుధ్య పర్యవేక్షక అధికారులు, సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయకుండా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కిరాణా దుకాణాలు, బేకరీల్లోనూ ప్లాస్టిక్ కవర్లు గుట్టలుగా కనిపిస్తున్నాయి. నిషేధిత గడువు వారం మాత్రమే ఉండడంతో ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభించాలని పర్యావరణ హితులు కోరుతున్నారు.

రైతుబజారు ఎస్టేట్ అధికారిణిగా సత్య కళా

పెదవాల్తేరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పెదవాల్తేరు రైతుబజారు ఎస్టేట్ అధికారిణిగా (ఈవోగా) ఎం.సత్యకళా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఈఓ వరలక్ష్మిని గాజువాకకు బదిలీ చేశారు. పెదగంట్యాడ రైతుబజారు ఎస్టేట్ అధికారిణిగా ఉన్న సత్యకళాను పెదవాల్తేరు వచ్చారు. ఈ సందర్భంగా రైతులు ఆమెను అభినందించారు.

రేపు పారిశుధ్య కార్మికులకు సెలవు

సిరిపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) :
జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు బుధవారం క్రిస్మస్ సెలవు కావడంతో నగర ప్రజలు ఇళ్లల్లోని వ్యర్థాలను తమ నివాసం వద్ద నిల్వ చేసి, మరుసటి రోజు కార్మికులకు అందజేయాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి. సంపత్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

అలరించిన కర్ణాటక సంగీతం



భీమునిపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) :పట్టణంలోని శ్రీ శారదా రామకృష్ణ సమాజంలో సోమవారం రాత్రి కర్ణాటక సంగీతం వీనుల విందుగా సాగింది. మందిరంలో భగవతి శ్రీ శారదామణి దేవి జయంత్యుత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శ్రీకాకుళంకు చెందిన టి.పావని గాత్రం, విశాఖకు చెందిన ఎ. విజయశ్రీ వాయులీనం, విజయనగరానికి చెందిన ఎన్. రుషీశ్వరరావు మృదంగంతో సాగిన కర్ణాటక సంగీతం శ్రోతలను అలరించింది. అనంతరం అఖండ హారతిలో భక్తులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **బచ్చలమల్లి :** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
● **విడుదల-2 :** శ్రీకన్య వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **యుఐ :** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
● **ముఫాసా :** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
● **పుష్ప-2 :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 28,వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 36, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 42, బీరకాయలు 50, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 24, క్యారెట్ 38 దొండకాయలు 46, బంగాళ దుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 140, అల్లం (పాతది) 56, బరబాటి 42, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 30 దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 320, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 56, కీరదోస 36, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 42, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	595
విజయనగరం	599
శ్రీకాకుళం	599

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	90
ఫారం ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200



సిరిపురంలోని సెయింట్ పాల్స్ చర్చికి విద్యుత్ దీపాలంకరణ

చారిత్రక చర్చికి క్రిస్మస్ కళ

సిరిపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలకు నగరంలోని పురాతన చర్చిలు సుందరంగా ముస్తాబవుతున్నాయి. సిరిపురంలోని వాల్తేర్ క్లబ్ సమీపంలోని సెయింట్ పాల్స్ చర్చి వద్ద క్రిస్మస్ సందడి ప్రారంభమైంది. విశాఖకు ఆయువుపట్టు వంటి సిరిపురంలోని 186 ఏళ్ల నాటి చర్చిలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని సెయింట్ పాల్స్ చర్చిని విద్యుత్ అలంకరణలతో తీర్చిదిద్దారు. క్రిస్మస్ పండుగ రోజున రెవరెండ్ డాక్టర్ జి.జాన్స్ అగస్టీన్ ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. క్రీస్తు బోధనలపై ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని చర్చి కమిటీ కార్యదర్శి రాకేష్ ఆనంద్, కోశాధికారి విజయపార్థన్ తెలియజేశారు. క్రీస్తు బోధనలు, గీతాలాపన ఉంటాయన్నారు. చరిత్ర కలిగిన చర్చిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు తెలియజేశారు. ఏసుక్రీస్తు భక్తులందరికీ ఉచితంగా ప్రసాద వితరణ చేయనున్నట్టు తెలిపారు.

జాగా ఎవరిదైతే మాకేం.. అద్దె మాకే!

» 16వ వార్డులో వైసీపీ నాయకుల దందా
» పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు

వెంకోజీపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఖాళీ స్థలం ఉంటే అది ఎవరిదైనా వారికి అనవసరం. దానిపై తమకు ఆదాయం వస్తుందో లేదో చూసుకోవడమే ముఖ్యం. సొమ్ము ఒకరిది.. సోకు మరొకరిది.. అన్న చందంగా ఇక్కడ వైసీపీ నాయకుల దందా నడుస్తుంది. 16వ వార్డులోని హెచ్‌బీకాలనీ నుంచి కృష్ణా కళాశాలకు వెళ్లే మార్గంలో బడ్డీల ఆక్రమణ తతంగమిది. ఇక్కడ రోడ్డును ఆక్రమించి బడ్డీలు ఏర్పాటు చేసి బతుకు తెరువు సాగిస్తే ఎవరైనా అయ్యో పాపం, ఏదో విధంగా కష్టపడి జీవనం సాగిస్తున్నారని అనుకుంటారు. కానీ ఇక్కడ దానికి భిన్నంగా గత ప్రభుత్వంలోని నాయకులు తమ దందాలో భాగంగా ఇక్కడ బడ్డీలు ఏర్పాటు చేసి చిరు వ్యాపారులకు రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు అద్దెకు ఇచ్చి తమ ఆదాయ వనరులు సమకూర్చుకున్నారు. ప్రభుత్వం మారినా ఇప్పటికీ అవే అద్దె బడ్డీలు కొనసాగుతున్నాయి. అంతేకాదు..! ఇక్కడ సులభ కాంప్లెక్సు సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏకంగా ఒక



ప్రభుత్వ స్థలంలో అద్దెకిచ్చిన అల్పాహార దుకాణం

పెద్ద దుకాణాన్ని ఏర్పాటు చేసి అల్పాహార విక్రయానికి రూ.8 వేలకు అద్దెకు ఇచ్చేశారు ఓ వైసీపీ నాయకుడు. రోడ్డుపై ఎవరైనా చిన్న తోపుడు బండి పెట్టుకుంటే వారిని దుర్భాషలాడుతూ తీసేంత వరకు గొడవ చేసే టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఈ అక్రమ దందా ఎందుకు కనిపించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. వారి వద్ద మామూలు వసూలు చేసుకుంటున్నారా? లేక కార్పొరేటర్‌కు వత్తాసు పలుకుతున్నారా? అనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ బడ్డీల కారణంగా రోడ్డు కుంచించుకు పోయిందని, దీనివల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా టౌన్‌ప్లానింగ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పీవీ ఆర్థిక సంస్కరణలే దేశాభివృద్ధికి మూలం

మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

సిరిపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఆనాడు చేపట్టిన ఆర్థిక సంస్కరణలే నేటి దేశాభివృద్ధికి పునాదులుగా నిలిచాయని మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. పీవీ నరసింహారావు 20వ వర్ధంతి సందర్భంగా సిరిపురం గవర్నర్ బంగ్లా వద్ద ఉన్న ఆయన విగ్రహానికి వైజాగ్ బ్రాహ్మిణ్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ఆయన ఎంతో ముందుచూపుతో సరళీకరణ ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టడం ద్వారా నేడు భారతదేశం ఎవరూ ఊహించని విధంగా అభివృద్ధి చెందిందన్నారు. దేశ చరిత్రలో పీవీ నరసింహారావు సుస్థిరంగా నిలిచే ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెరువు రామకోటయ్య, వుడా మాజీ ఛైర్మన్ పి.రవిరాజు, విశ్రాంత పోలీసు అధికారి టీఎస్సార్ ప్రసాద్, రాచకొండ చారిటీస్ ఛైర్మన్ దశరథ రామయ్య, వైజాగ్ బ్రాహ్మిణ్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కావూరు చరణ్, న్యాయవాది కేసాప్రగడ నరసింహమూర్తి, వైసీపీ నాయకులు నందమూరి సుబ్రహ్మణ్యం, కార్మిక నాయకులు కాశీభట్ల నాగభూషణ్, వ్యాసశర్మ, శంకర్‌నీలు భాగవతుల తదితరులు పాల్గొన్నారు.



ఆదేశ్వరరావు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న యార్లగడ్డ

అధ్యయన ప్రక్రియకు ఆద్యుడు ఆదేశ్వరరావు

విశాఖపట్నం : దక్షిణ భారతదేశం హిందీకి వ్యతిరేకమన్న ముద్రను చెరిపివేసిన ప్రొఫెసర్ ఆదేశ్వరరావు సేవలు ఆదర్శమని రాజ్యసభ మాజీ ఎంపీ, ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పేర్కొన్నారు. ఆదేశ్వరరావు జయంతి సందర్భంగా ఏయూలోని హిందీ విభాగంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సుప్రసిద్ధ రచయిత, కవి అలూ రి బైరాగి వద్ద హిందీ అధ్యయనం చేసిన ఆదేశ్వరరావు జాతీయస్థాయిలో గుర్తింపును తెచ్చుకున్నారన్నారు. హిందీ, తెలుగు సాహిత్యాల తులనాత్మక అధ్యయనం ప్రక్రియకు ఆద్యుడిగా నిలిచారన్నారు. ఆయన చేసిన పరిశోధనలు ఖ్యాతిని, గౌరవాన్ని తీసుకువచ్చాయన్నారు. ఆదేశ్వరరావు ఏయూ హిందీ విభాగంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు.ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నరసింహారావు, హిందీ విభా గాధిపతి నల్లా సత్యనారాయణ, ఆదేశ్వరరావు కుమారు విజయ్ భాస్కర్ మాట్లాడారు. అనంతరం ఆదేశ్వరరావు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించి అభినందిస్తున్న ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

ఆలిండియా వర్సిటీ అథ్లెటిక్స్‌కు ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థులు

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల, మహిళల అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ టోర్నీలో పాల్గొనే డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ జట్టుకు నగరానికి చెందిన ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థులు బి.రవికుమార్, కాజల్ సింగ్, డి.చరణ్ నాయక్ ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ నెల 26 నుంచి భువనేశ్వర్‌లో జరిగే ఈ మీట్ పురుషుల 100 మీటర్లు, 200 మీ. 4+100 రిలే పరుగు ఈవెంట్లలో బి.రవికుమార్, 400 మీ., 800 మీ., 1500 మీ. పరుగు ఈవెంట్లలో డి.చరణ్ నాయక్, మహిళల 800 మీ., 1500 మీ. పరుగు ఈవెంట్లలో కాజ సింగ్ ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ సందర్భంగా ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు సోమవారం తన కార్యాలయంలో విద్యార్థి అథ్లెట్లను అభినందించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ స్పోర్ట్సు వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్. సునీల్‌కుమార్, ఫిజికల్ డైరక్టర్ డాక్టర్ ఎంఎస్ఎన్ పాత్రుడు, హెచ్‌వోడీ డాక్టర్ సీహెచ్ఆర్ఎస్.భూషణరావు, డాక్టర్ పి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై పొంచి ఉన్న ప్రమాదం

ఆరిలోవ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రహదారి చక్కగా ఉందని వేగంగా వెళ్లారో.. బోల్తా పడాల్సిందే. ఆరిలోవలోని పలు ప్రాంతాల్లో యూజీడీ మేన్‌హోల్స్ ప్రమాదకరంగా ఉన్నాయి. ఇవి రోడ్డు కన్నా సుమారు అర అడుగు లోతులో ఉండడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. పలు సందర్భాల్లో అనేక మంది గాయపడ్డారు. ఇవి స్పీడ్ బ్రేకర్లకన్నా ప్రమాదకరంగా ఉన్నాయి. జీవీఎంసీ, యూజీడీ పర్యవేక్షక అధికారులు వీటి ఎత్తు పెంచాలని బాటసారులు కోరుతున్నారు. ఆరిలోవ ప్రాంతంలో సుమారు 30 వరకు మేన్‌హోల్స్ ఇలాగే లోతున ఉన్నాయి. ప్రమాదాలు జరగకముందే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, వాహన చోదకులు జాగ్రత్తగా వెళ్లాలని స్థానికులు సూచిస్తున్నారు.



లోతుగా ఉన్న యూజీడీ మేన్‌హోల్



అర్జీదారులతో మాట్లాడుతున్న వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్

వీఎంఆర్డీఏలో ప్రజా దర్బార్..

సిరిపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సిరిపురం వీఎంఆర్డీఏ భవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు మొత్తం 13 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమానికి వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. బాధితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించరాదని అధికారులకు సూచించారు. అందిన అర్జీల్లో ఇంజనీరింగ్ 1, ప్రణాళిక 7, ఎస్టేట్ 2, రెవెన్యూ 2, మిగిలినవి ఇతర విభాగాలకు చెందినవి ఉన్నాయి. ఈ కార్యక్రమంలో వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, చీఫ్ అర్బన్ ప్లానర్ వి.శిల్ప, ల్యాండ్ అక్విజిషన్ అధికారి వేణుగోపాల్, పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోదాదేవికి 8వ పాశుర విన్నపాలు



సింహాచలం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న సన్నిధిలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం తిరుప్పావైలోని 8వ పాశుర విన్నపాలు చేశారు. సుప్రభాతసేవ, ప్రభాతారాధనలు తరువాత ఉత్సవమూర్తిని గోదాదేవిగా అలంకరించి, ప్రత్యేక పల్లకిలో అధిష్ఠింపజేశారు. వేద మంత్రాలు,విద్వాంసుల నాదస్వరాలపనలు నడుమ బేడా మండపంలో తిరువీధి జరిపారు.అనంతరం ఆండాళ్ అమ్మ వారి సన్నిధిలో తిరుప్పావై సేవాకాలం నిర్వహించి, ఎనిమిదవ పాశురాన్ని అధ్యాపకులు ఆలపించారు. అలాగే కొండదిగువ పూదోటలో ఉన్న అలిమేలుమంగా, పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు జరిగాయి.

తాగునీటి కుళాయిలు ప్రారంభం

పద్మనాభం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలను ఎంపీపీ కె. రాంబాబు సోమవారం ప్రారంభించారు. ప్రధాన వీధుల్లో తాగునీటి సమస్య ఉన్న విషయాన్ని స్థానికులు ఎంపీపీ దృష్టికి తీసుకువెళ్లడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.80 లక్షలలతో వీటిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టి. పాప, ఎంపీటీసీ సభ్యురాలు కె. లక్ష్మి, వార్డు సభ్యురాలు నారాయణమ్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కారుతో అభివృద్ధి పరుగులు

20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్

పెదవాల్తేరు డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ డబుల్ ఇంజిన్ సర్కార్లతో రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెడుతోందని, త్వరలో రూ.11,500 కోట్ల వ్యయంతో విశాఖ జిల్లాలో 46 కిలోమీటర్ల పొడవున మెట్రో రైలుమార్గం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతుందని 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ అన్నారు. సోమవారం నగర బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధిపై పూర్తిగా దృష్టి సారించామన్నారు. విశాఖ ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగు పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణం కోసం నిపుణులతో డీపీఆర్ సిద్ధం చేసిందని, దీని నిర్మాణానికి కేంద్రం పూర్తిగా సహకరిస్తుందన్నారు. 20 సూత్రాల కార్యక్రమం అమలుపై ఈనెల 28 వరకు కలెక్టర్ కార్యాలయాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షిస్తామన్నారు. అన్ని జిల్లాల్లో మే నెలాఖరుకు సమీక్షలు పూర్తి చేసి నివేదికలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు పంపిస్తామన్నారు. వచ్చే మూడేళ్లలో పోలవరం పూర్తవుతుందని, దీని నుంచి విశాఖ నగరానికి 23.44 టీఎంసీల నీరు కేటాయించారన్నారు. రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం 20 నెలల్లో పూర్తవుతుందన్నారు. కేంద్రం అమలు చేస్తున్న జల జీవన్ మిషన్ పథకంతో గ్రామాల్లో ప్రతి ఇంటికీ సురక్షిత నీటిని అందిస్తుందన్నారు. రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ పారిశ్రామికావసరాలకు అనుగుణంగా సాంకేతిక విద్య పాఠ్యాంశాల్లో మార్పు చేయడం అభినందనీయమన్నారు. ఆయుష్మాన్ భారత్, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకాలను మిళితం చేసి సమర్థంగా అమలు చేస్తామని దినకర్ అన్నారు. కార్యక్రమంలో బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు మురళీమోహన్, మహిళా మోర్చా నాయకురాలు ఉమ్మడి సుజాత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లంకా దినకర్



పెదగదిలిలో కానరాని విద్యుత్ కాంతులు, విరజిమ్మని ఫౌంటెన్

సొబగులు మూణ్నాళ్ల ముచ్చటేనా?

ఆరిలోవ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పెదగదిలి కూడలిలో జీవీఎంసీ నిధులు లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఫౌంటెన్ మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలింది. కలువపువ్వు మాదిరిగా నిర్మించి, దానికి విద్యుత్ కాంతులు ఏర్పాటు చేసి వాటర్ ఫౌంటెన్‌గా తీర్చిదిద్దారు. నగర మేయర్ ఇంటికి కూత వేటు దూరంలో ఉన్నా ఈ ఫౌంటెన్ వెలుగు మసకబారింది. నాలుగు నెలలుగా దీనిని ఎవరూ పట్టించుకోవడం లేదు. సాయంత్రం సమయంలో హెల్త్ సిటీ వచ్చిన రోగుల బంధువులు ఇక్కడ కాసేపు సేదదీరి వెళ్లేవారు. రంగుల విద్యుత్ కాంతులు సప్త వర్ణాలతో విరాజిల్లే ఆ సొగసు నేడు కాన రాకుండా పోయింది. హనుమంతవాక జంక్షనులో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన హనుమంతుని విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఫౌంటెన్ కూడా అదే దీనస్థితిలో ఉంది. జీవీఎంసీ అధికారులు ఈ రెండు కూడళ్లలో సొబగులు పునరుద్ధరించాలని ఆయా ప్రాంతాలవారు కోరుతున్నారు.

ప్రమాదకరంగా కేబుల్ వైర్లు



ఆరిలోవ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డులోని ఆదర్శనగర్ కూడలిలో కేబుల్ వైర్లు నేలకు అడుగు దూరం ఎత్తులో వేలాడి ఉన్నా అధికారుల దృష్టిలోకి రాలేదు. అనునిత్యం పెద్దసంఖ్యలో వాహనాలు ఈ కూడలి గుండా వెళ్తాయి. పొరపాటున ఈ వైర్లు ద్విచక్ర వాహన చోదకుల కాలికి తగిలితే అంతే సంగతులు! గతంలో ఓ ద్విచక్ర వాహనచోదకుడు గాయపడ్డాడు. ఎవరిష్టం వచ్చినట్లుగా వారు కేబుల్ వైర్లను విద్యుత్ స్తంభాలకు వేలాడదీస్తే ఎలా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న ఈ కేబుల్‌ను తొలగించాలని కోరుతున్నారు.

సర్వీస్ రోడ్డా..పార్కింగ్ స్థలమా?



శివాజీపార్క్ రోడ్డులో వాహనాల పార్కింగ్

మద్దిలపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శివాజీపాలెం రోడ్డు పార్కింగ్ స్థలంలా మారింది. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. శివాజీపార్కు రోడ్డులో కనుచూపు మేర పార్కింగ్ చేసిన వాహనాలే కనిపిస్తున్నాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇదే రోడ్డును ఆక్రమించారని ఇటీవల జీవీఎంసీ జోన్-3 టౌన్‌ప్లానింగ్ సిబ్బంది చిరువ్యాపారులను తొలగించారు. ఇప్పుడు శివాజీపార్క్ రోడ్డంతా పార్కింగ్ స్థలంగా మార్చేశారు. శివాజీపాలెం నివాసులు, ట్రాన్స్‌పోర్ట్ సంస్థలు తమ వాహనాల పార్కింగ్ స్థలంగా ఈ రోడ్డును వినియోగించుకుంటున్నారు. ఇసుకతోట జాతీయరహదారి నుంచి శివాజీపార్కు మీదుగా పెదవాల్తేరు జంక్షన్ వరకు రెండు లైన్ల రహదారి మొత్తం ఆక్రమణలకు గురైంది. అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. నో పార్కింగ్ ప్రాంతాల్లో నిలిపిన వాహనాలకు చలానాలు రాస్తున్న ట్రాఫిక్ పోలీసులు సైతం శివాజీపార్క్ రోడ్డుపై దృష్టి సారించడం లేదు.

'పీవీ దేశానికి ఊపిరి పోశారు'

సిరిపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు విప్లవాత్మక సంస్కరణలతో ఈ దేశానికి ఊపిరి పోశారని కాంగ్రెస్ నాయకులు జగన్ మురారి అన్నారు. సోమవారం పీవీ నరసింహారావు జయంతి పురస్కరించుకుని గవర్నర్ బంగ్లా వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీవీ దేశానికి అందించిన సేవలు శ్లాఘనీయమన్నారు. ఆయన స్ఫూర్తిని నేటి పాలకులు అందిపుచ్చుకోవాలన్నారు. పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేవీ సూర్యనారాయణ, సీనియర్ నాయకులు కస్తూరి వెంకటరావు, మధు, మహిళా నాయకురాలు కాండవ గాయత్రి, నొల్లు నాగరాజు, దేవర వెంకటేష్ పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్లు ఎంపిక రేపు

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో జనవరి మూడో తేదీ నుంచి జరగనున్న 50వ అంతర్ జిల్లాల బాలబాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ఈ నెల 25న ఎంపిక చేయనున్నట్లు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గాజువాక హైస్కూల్ గ్రౌండ్‌లో ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచే జరిగే ఈ ఎంపిక పోటీలకు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఛైర్మన్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హాజరవుతారన్నారు. 20 ఏళ్లలోపు బాలబాలికలు ఈ ఎంపిక పోటీలకు అర్హులని వారు పేర్కొన్నారు. బాలురు 70 కిలోలు, బాలికలు 65 కిలోలలోపు బరువు వుండాలని, వయసు ధ్రువీకరించే ఒరిజినల్ ఆధార్ కార్డుతో ఈ పోటీలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 7680005666 సెల్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో క్రీడాకారులకు పతకాలు



విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి అండర్-17 బాలుర, బాలికల పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో ఉమ్మడి విశాఖ లిఫ్టర్లు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. విజయవాడలో జరిగిన ఈ టోర్నీలో బాలుర విభాగంలో కుమార స్వామి (53 కిలోలు), దీనరాజు (101 కిలోలు) స్వర్ణ పతకాలు, పి.సూర్య సాకేత్ (66 కిలోలు) కాంస్య పతకం, ఎం.నాగరాజు (93 కిలోలు) కాంస్య పతకం సొంతం చేసుకున్నారు. బాలికల విభాగంలో ఎ.పూర్వజ (52 కిలోలు) స్వర్ణ పతకం, ఎం.లక్ష్మీదేవి (47 కిలోలు), పి.సాయి సంజనశ్రీ (57 కిలోలు), ఎం.అమృతవల్లి (69 కిలోలు) కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులతోపాటు కోచ్‌గా వ్యవహరించిన జి.దేవిని ఎస్‌జీఎఫ్ ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి దేముడు, ఇతర ప్రతినిధులు ఎంపీ నాగేశ్వరరావు, వి.కొండబాబు తదితరులు అభినందించారు.

మిజోరంపై ఉత్తరప్రదేశ్ విజయం

విశాఖపట్నం, స్పోర్ట్సు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ తొమ్మిది వికెట్ల తేడాతో మిజోరాంపై విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన మిజోరాం 34.3 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటైంది. మోహిత్ జంగ్రా అర్థ సెంచరీ (70),ధన్యుమ (24) మినహా మిగిలినవారు విఫలమయ్యారు. ఉత్తరప్రదేశ్ బౌలర్లు శివం మావి ఐదు వికెట్లు, వెహిసిన్ ఖాన్ మూడు వికెట్లు పడగొట్టి మిజోరాం బ్యాటింగ్‌ను దెబ్బతీశారు.సాధారణ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరప్రదేశ్ 20.3 ఓవర్లలో కేవలం ఒక వికెట్ కోల్పోయి 144 పరుగులు చేసి విజయం సొంతం చేసుకుంది. ఓపెనర్లు అభిషేక్ గోస్వామి (47) ఆర్యన్ జుయల్ అజేయ భారీ అర్థ సెంచరీ (86 నాటౌట్) సాధించి జట్టుకు సునాయాస విజయాన్నందించారు.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు.ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి, భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. అనంతరం కల్యాణ క్రతువు నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

మొక్కల ప్రేమికుడు!

అతడో సాధారణ కారు డ్రైవర్. చాలీచాలని సంపాదనతో కుటుంబాన్ని పోషించుకుంటాడు. కానీ మొక్కలంటే అమిత ప్రేమ. పర్యావరణ పరిరక్షణకు తన వంతు ఏదైనా చేయాలనే అభిలాష. దీంతో మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టాడు. తన సంపాదనలో కొంత మొత్తాన్ని మొక్కల కొనుగోలుకు వినియోగించి, ఇప్పటివరకు సుమారు 400 మొక్కలు నాటాడు. వృక్ష ప్రేమికులకు ఉచితంగా మరిన్ని మొక్కలు అందించాడు. ప్రకృతిని కాపాడేందుకు అందరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిస్తున్న పెందుర్తికి చెందిన ఆళ్ల శ్రీను జీవీఎంసీ సహకరిస్తే వేలాది మొక్కలను నాటి, సంరక్షించాలనే ధ్యేయంలో ఉన్నాడు.

- పెందుర్తి, ఆంధ్రజ్యోతి

పర్యావరణ పరిరక్షణకు దీక్ష

- సొంత డబ్బుతో కార్యాచరణ
- ఇప్పటికే 400 మొక్కలు నాటిన వైనం
- పదివేలు నాటాలన్నదే లక్ష్యం
- జీవీఎంసీ సహకారానికి ఎదురుచూపులు
- పచ్చదనం పెంపునకు అవిరళ కృషి
- **ఆదర్శంగా నిలుస్తున్న కారు డ్రైవర్ ఆళ్ల శ్రీను**

పెందుర్తి బీసీ కాలనీకి చెందిన ఆళ్ల శ్రీను కారు డ్రైవర్. నెలకు రూ.10 వేల లోపే సంపాదన. చిన్నతనంలో తన తాతగారికి కొబ్బరి తోట ఉండేది. ఆ చెట్ల పచ్చదనం మధ్య బాల్యం నడిచింది. ఆర్థిక పరిస్థితులు అనుకూలించక తోట విక్రయించేశారు. కానీ ఆ తోటలో గడిపిన అనుభవాలు శ్రీను మనసులో పదిలంగా నాటుకున్నాయి. తనతో పాటే ఆశయం పెరిగింది.

ఇంటి నుంచే తొలి అడుగు...

ఆశయ సాధనకు తన ఇంటి నుంచే తొలి అడుగు వేశాడు. కుమార్తె జన్మదినం సందర్భంగా కొన్ని మొక్కలు కొనుగోలు చేసి నాటాడు. అయితే ఇలాంటి సందర్భంలో మొక్కలు నాటడం చూసి ఇదేం విడ్డూరం అని అనుకున్నా... వాటిని పట్టించుకోలేదు. ప్రకృతి పరిరక్షణకు పిల్లల జన్మదిన వేడుకలకు ఓ మంచి పనిచేయండి అని స్నేహితులు,బంధువులు, పరిచయమున్న వారిని అడిగేవాడు. మీ పిల్లల జన్మదినోత్సవానికి గుర్తుగా మొక్కలు నాటండని పిలుపునిచ్చాడు. తన సొంత డబ్బుతో నర్సరీ నుంచి బాదం, వేప, కొబ్బరి తదితర మొక్కలను కొనుగోలు చేసి వారితో నాటించాడు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత తను తానే తీసుకున్నాడు. ఈ క్రమంలో కొంతమంది ముందుకువచ్చి శ్రీనుకు సహకరించగా, మరింత మంది ఎగతాళి చేశారు. అయినా శ్రీను తన ఆశయ సాధనలో వెనక్కి తగ్గలేదు. మొక్కల పెంపకాన్ని జీవన గమనంగా చేసుకుని ముందుకు సాగుతున్నాడు.



పాఠశాలలో మొక్కలు అందజేస్తున్న శ్రీను

దాతల సహకారంతో..

తన ఆశయ సాధనకు కొంతమంది ఆర్థిక సహకారం అందించారు. దాంతో మరింత ముందుకు వెళ్తున్నాడు. పాత పెందుర్తి, పెట్రోల్‌బంకు, ఆరోగ్య కేంద్రం, గౌరీ సేవా సంఘం, శ్మశానవాటిక ప్రాంతాల్లో విరివిరిగా మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టాడు. హుద్‌హుద్ ప్రళయంలో వేలాది వృక్షాలు నేలకొరగడంతో పచ్చదనం, పర్యావరణాన్ని ప్రేమించే శ్రీను కదిలిపోయాడు. మొక్కల పునరుద్ధరణకు ప్రజలను భాగస్వాములను చేశాడు. ప్రయత్నం ఫలించి ఎంతోమంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరివిగా మొక్కలు నాటారు. వేసి వదిలేయడమే కాకుండా ప్రతిరోజు ఉదయం వాటికి నీరు పోసి సంరక్షిస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు శ్రీను స్వయంగా 400 మొక్కలు నాటి పరిరక్షిస్తున్నాడు. మొక్కలు పెంపకం, సంరక్షణకు స్థానిక నేత శరగడం నరసింహమూర్తి ఎంతగానో సహకరిస్తున్నారని, ఇలా మరింత మంది ముందుకువస్తే పర్యావరణాన్ని కాపాడవచ్చని చెబుతున్నాడు.



మొక్కలు నాటేందుకు స్కూటీపై తీసుకువెళుతున్న ఆళ్ల శ్రీను

అవగాహన కార్యక్రమాలు..

ఏదీ ఒక్కరి వల్లే సాధ్యం కాదని గుర్తించిన శ్రీను మొక్కల పెంపకంపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాడు. వారు పుట్టినరోజులు ఇతర శుభ కార్యక్రమాలకు గుర్తుగా మొక్కలు నాటేలా వారితో ప్రతిజ్ఞ చేయిస్తున్నాడు. ఆచరణలో అమలు చేసేలా ఉత్సాహపరుస్తున్నాడు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని విస్తృత ప్రచారం చేస్తున్నాడు. కాలుష్యం లేని ద్విచక్ర వాహనం కొనుగోలు చేసి ఊరూరా మొక్కల పెంపకం ఆవశ్యకతను వివరిస్తున్నాడు. శ్రీను చేస్తున్న ఈ కృషికి గుర్తింపుగా ఇటీవల పెందుర్తి గౌరీ సంఘ కల్యాణ మండపంలో అతడిని సత్కరించారు.

సహకరిస్తే మరింత ముందుకు



మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ చాలా కీలకం. ఇందుకోసం సహకారం అవసరం. జీవీఎంసీ సహకరిస్తే పదివేల మొక్కలు నాటాలన్నది నా లక్ష్యం. కొంతమంది మొక్కలు నాటి వదిలేస్తారు. దానివల్ల ఎలాంటి ఫలితం ఉండదు. అవి చెట్లుగా మారే వరకు పోషణ బాధ్యత కూడా చూడాలి. నేను నాటిన ప్రతి మొక్కా ఎదిగేవరకు వాటి బాధ్యతలు తీసుకుంటాను. అందులో ఎంతో తృప్తి ఉంది. జీవీఎంసీ అధికారులు స్పందించి ట్రీగార్డులు అందిస్తే రహదారుల పక్కన మంచి మొక్కలు నాటి సంరక్షించాలన్నది నా ఆశయం.

- ఆళ్ల శ్రీను, పెందుర్తి



ఆళ్ల శ్రీనును సత్కరిస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

నగరంలో పర్యాటకాభివృద్ధికి ప్రాధాన్యం

- రుషికొండ దక్షిణ రోడ్డు పునఃప్రారంభంలో ఎంపీ శ్రీభరత్



రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్, చిత్రంలో ఎమ్మెల్యేలు పల్లా, వంశీకృష్ణ, తదితరులు

సాగర్‌నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో పర్యాటక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. రుషికొండ దక్షిణ రహదారిని సోమవారం ఆయన పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవతోనే రహదారిని పునఃప్రారంభించామన్నారు. వారాంతాల్లో పర్యాటకులు ఎక్కువగా వచ్చే దక్షిణ రోడ్డును కొందరు స్వలాభం కోసం మూసివేయడం దారుణమన్నారు. రుషికొండ బీచ్ అభివృద్ధిలో ఈ రోడ్డు తెరవడం కీలక పరిణామమన్నారు. రుషికొండ ప్యాలెస్‌ను ఏవిధంగా వినియోగంలోకి తీసుకురావాలో ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. దక్షిణ రహదారిలో లైట్లు, సీసీకెమెరాలు, సెక్యూరిటీ చర్యలపై చర్చిస్తున్నామన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఈ రహదారి నిర్మించి రుషికొండ బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేశామని, వైసీపీ దానిని మూసివేసి నిర్మానుష్యంగా మార్చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, జేసీ అశోక్, ఏపీసీఓఎస్‌జీఎఫ్‌ఎల్ చైర్మన్ గండి బాబ్జీ, ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్, జనసేన భీమిలి ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాల భద్రతలో ఆర్కిటెక్ట్‌లూ భాగస్వాములే

- ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ (ఐఐఏ) విశాఖ ప్రతినిధులు



వినతిపత్రం ఇస్తున్న ఆర్కిటెక్ట్‌ల బృందం

విశాఖపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారీ నిర్మాణాల భద్రతలో ఆర్కిటెక్టులు కీలకపాత్ర పోషిస్తున్నారని, ప్రభుత్వం వారిని గుర్తించి చట్టపరంగా భాగస్వాములను చేయాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ (ఐఐఏ) విశాఖ బృందం కోరింది. మంగళగిరిలో డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) అడిషనల్ డైరెక్టర్ బి.శ్రీనివాసులను సోమవారం బృందం సభ్యులు కలిసి పలు అంశాలపై చర్చించారు. పారిశ్రామిక సముదాయాలు, ఆస్పత్రులు, పర్యాటక నిర్మాణాలలో ఆర్కిటెక్ట్‌లు ఉండేలా నిబంధనలు రూపొందించాలని కోరారు. అనధికార నిర్మాణాలు, అతిక్రమించి నిర్మాణాలు చేపట్టిన అంశాలను నివేదించడానికి, వాటిని సరిదిద్దడానికి సూచనలు చేసే అవకాశం కల్పించాలన్నారు. సుస్థిరమైన పట్టణాల అభివృద్ధికి ఆర్కిటెక్ట్‌లు కృషిచేస్తున్నందున గుర్తింపు ఇవ్వాలన్నారు. దానికి ఏడీ సానుకూలంగా స్పందించినట్టు ఐఐఏ బృందం తెలిపింది.

భారత్ జట్టులో స్థానమే ధ్యేయం

- ఐపీఎల్ క్రికెటర్ పైలా అవినాశ్



సింహాచలం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారత్ జట్టులో స్థానమే తన లక్ష్యమని ఆంధ్రా రంజీ క్రికెటర్ పైలా అవినాశ్ అన్నారు. సోమవారం ఆయన వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)కు ఇటీవల జరిగిన వేలంలో రూ.30 లక్షలతో పంజాబ్ కింగ్స్ జట్టుకు ఎంపికైనట్టు చెప్పారు. మ్యాచ్‌లో ప్రతిభ చూపి, భారత్ జట్టులో స్థానం పొందేందుకు తగిన కసరత్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఏయూను సందర్శించిన అదానీ అధికారులు



సిద్ధార్థ ఘోష్‌ను సత్కరిస్తున్న ఏయూ అధికారులు

విశాఖపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అదానీ విల్మార్ సంస్థ చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్ సిద్ధార్థ ఘోష్ సోమవారం సందర్శించారు. క్యాంపస్‌లో జరిగే సంస్థ నియామక ప్రక్రియలో సంస్థ హెచ్ఆర్ డీజీఎం ప్రభాకర్ కొర్రపాటి, ప్లాంట్ హెచ్ఆర్ హెడ్ యుగంధర్ మామిడి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్ధార్థ ఘోష్ వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎస్ ధనుంజయరావులను మర్యాదపూర్వకంగా కలిశారు. అదానీ విల్మార్, ఏయూల మధ్య శాస్త్రీయ, పారిశ్రామిక బంధం బలపేతం చేసుకుంటూ విద్యార్థులకు ఉద్యోగావకాశాలను కల్పించేలా చర్చించారు. సమావేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు, సౌత్ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ అండ్ కార్పొరేట్ రిలేషన్స్ డైరెక్టర్ వీఆర్ రెడ్డి, ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి.మోహన్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీలో వైసీపీ ఫ్లోర్ లీడర్‌గా పైల



సన్యాసిరాజును సత్కరిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్‌లో వైసీపీ ఫ్లోర్ లీడర్‌గా పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసి రాజు ఎన్నికయ్యారు. చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జడ్పీలో సోమవారం వైసీపీ జడ్పీటీసీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఫ్లోర్‌లీడర్‌గా ఎన్నికైన సన్యాసిరాజును సభ్యులంతా అభినందించారు.

రెవెన్యూ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యవర్గం



సొసైటీ నూతన కార్యవర్గ సభ్యులు

విశాఖపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల హౌస్ బిల్డింగ్ సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నికలు ఇటీవల నిర్వహించారు. అధ్యక్షుడిగా బెహరా రవిశంకర్, ఉపాధ్యక్షురాలుగా కె.వి జయకుమారి, కార్యదర్శిగా ఎం.మధుసూదనరావు, డైరెక్టర్లుగా బోరా అప్పలనాయుడు, ఐ.కృష్ణకిశోర్, కె.లక్ష్మణరావు, చుండ్రు చంద్రశేఖరరావు, జె.లోకేశ్, టి.చిరంజీవి పడాల్, పి.రమేష్‌బాబు, వంకల సింహాద్రి, పెద్దింటి సోమశేఖర్ ఎన్నికయ్యారు.

సామాన్యుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం: ఎంపీ శ్రీభరత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సామాన్యులు ఆర్థిక స్వావలంబనకు కేంద్ర ప్రాయోజిత పథకాలు అందించే దిశగా కార్యాచరణ రూపొందించాలని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. కేంద్ర పథకాల ప్రయోజనాలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. పథకాల అమలు, ఎదురవుతున్న సవాళ్లు, అధికారులతో సమన్వయం తదితర అంశాలపై సోమవారం కలెక్టరేట్‌లో దిశా (డిస్ట్రిక్టు డెవలప్‌మెంట్ కోఆర్డినేషన్ అండ్ మానటరింగ్ కమిటీ) 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్‌తో కలిసి ఎంపీ సమావేశం నిర్వహించారు. కేంద్రం నిధులతో 31 విభాగాల పరిధిలో అమల్లోని పథకాలపై సమీక్ష నిర్వహించి అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ మండలాల ప్రజలకు లబ్ధి చేకూర్చే గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుపై అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. ఔత్సాహికులకు పరిశ్రమల శాఖ నుంచి పూర్తి సహకారం అందించాలని, అసంఘటిత రంగ కార్మికులను ఈ-శ్రమలో చేర్చాలని, గృహ నిర్మాణాలు వేగవంతంచేయాలని, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, సురక్షిత తాగునీరు, క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలన్నారు. బియ్యం అక్రమ రవాణాను నివారించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అనర్హుల పింఛన్లను గుర్తించే క్రమంలో అధికారులు జాగరూకతతో వ్యవహరించాలని ఎంపీ, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గణబాబు, విష్ణుకుమార్ రాజు కోరారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఇచ్చే పింఛన్ల కోసం కొందరు తప్పుడు పత్రాలు సృష్టించారని, వారిని గుర్తించి నివేదించాలన్నారు. పింఛన్ల మంజూరుకు ఒంటరి మహిళల విషయంలో సడలింపు ఇవ్వాలని, మరగుజ్జులు, కేన్సర్ బాధితులను పరిగణనలో తీసుకోవాలని, భర్త చనిపోయిన వెంటనే దరఖాస్తును ఆమోదించాలని ఎమ్మెల్యేలు కోరారు. 20 సూత్రాల కార్యక్రమ అమలు చైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ కొన్ని శాఖల పరిధిలో నిధులు దుర్వినియోగం చేశారని, వాటిపై విచారణ చేయాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, పీ ఆయిల్ ఫెడ్ కోపరేటివ్ చైర్మన్ గండి బాబ్జీ, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి ప్రజాభిప్రాయ సేకరణ వాయిదా

విశాఖపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి సంబంధించి కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ముసాయిదా రూపకల్పన కోసం మంగళవారం నిర్వహించాల్సిన ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేసినట్టు కాలుష్య నియంత్రణ మండలి విశాఖ ప్రాంతీయ కార్యాలయం పర్యావరణ ఇంజనీర్ పీవీ ముకుందరావు తెలిపారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో మంగళవారం నిర్వహించాల్సిన కార్యక్రమం ఎప్పుడు నిర్వహించేదీ త్వరలో వెల్లడిస్తామన్నారు.

గిరిజన ఉద్యోగుల సంఘం కార్యవర్గం

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం విశాఖ జిల్లా విభాగం నూతన కార్యవర్గం ఏర్పాటయింది. గిరిజన్ భవన్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఉద్యోగులు ఓటు వేసి సంఘం అధ్యక్షుడిగా సానాయి అప్పలరాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రాథోడ్ వస్త్రాం, ఉపాధ్యక్షుడిగా ముత్యంగి ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శిగా కటారి శోభన్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా వంతాల కర్రిదొర, కోశాధికారిగా సీసా శోభన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా సమరెడ్డి బాల గంగాధర తిలక్, కార్యాలయం కార్యదర్శిగా జంపరంగి రాంబాబు, సహాయ కార్యదర్శిగా కొండగొర్రి ప్రసాదరావులు ఎన్నికయ్యారు.

ఆత్మవిశ్వాసం ఉంటేనే దేవుడి అండ: కలెక్టర్



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ హేరంధిర ప్రసాద్

సిరిపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ఏ సందర్భంలోనైనా ఆత్మవిశ్వాసంతో ఉంటేనే దేవుడు అండగా ఉంటాడని బైబిల్ అదే బోధిస్తోందని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో హైటీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. పాస్టర్ డానియల్ శ్యామ్, పాస్టర్ సంజీవకుమారి ప్రార్థనలు చేశారు. రాబర్ట్‌స్మిత్ పాస్టర్ ట్రినిటీ లూథరన్ సందేశాన్ని అందించారు. ఎంపీ శ్రీభరత్, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, జేసీ మయూర్ అశోక్, గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.

అర్జీల పునరావృతంపై కలెక్టర్ అసంతృప్తి

- పరిష్కరించకపోతే అధికారులదే బాధ్యత
- ప్రజా సమస్యలపై తాజాగా 335 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒకే సమస్యపై రెండోసారి వినతులు రావడంపై కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ప్రతి వారం ప్రత్యేక ఆదేశాలిస్తున్నా, కొందరు పరిశీలించకపోవడం, అదే సమస్యపై మళ్లీ వినతిపత్రం అందడంతో అధికారుల తీరును తప్పుపట్టారు. సోమవారం అందిన వినతులను 24 గంటల్లో పరిశీలించి, సమగ్ర విచారణ జరిపి పది రోజుల్లో పరిష్కారం చూపాలన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 335 వినతులు అందాయి. ఇందులో రెవెన్యూ 181, జీవీఎంసీ 64, పోలీసు 16, ఇతర శాఖలకు 74 ఉన్నాయి. అధికారులు ప్రజలతో నేరుగా మాట్లాడి పూర్తి పది రోజుల్లోగా పరిష్కరించాలని నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌వో భవానీశంకర్, ఆర్‌డీవో శ్రీలేఖ, సిటీ ప్లానర్ ధనుంజయరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పోలీసు కమిషనరేట్‌కు 98 వినతులు

మహారాణిపేట: పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 98 వినతులు స్వీకరించినట్లు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. సమస్యలు పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు.

మరుగుదొడ్ల నిర్వాహకులకు ప్రశంసాపత్రాలు

విశాఖపట్నం: జిల్లాలో వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్లు పరిశుభ్రంగా నిర్వహించిన వారికి కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ సోమవారం ప్రశంసాపత్రాలు అందజేశారు. వ్యక్తిగత కేటగిరీలో చందక ధనలక్ష్మి (ఆనందపురం), బూసా మంగ (వెల్లంకి), కొయ్య చిట్టితల్లి (చిప్పాడ), కాళ్ల సురేష్ (సింగనబంద), రావాడ శివ (పినగాడి), సామూహిక మరుగుదొడ్ల నిర్వహణలో పెదగాడి పంచాయతీ సర్పంచ్ కోసుబోయిన లావణ్య, కార్యదర్శి కె.లక్ష్మణరావు, వేములవలస పంచాయతీ సర్పంచ్ లంక కొండమ్మ, కార్యదర్శి ఎ.రామకృష్ణంనాయుడుకు అవార్డు, శాలువ, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి, డీపీవో ఏవీఏ శ్రీనివాసరావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ కేవీవీ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

సందడిగా గుడ్ గవర్నెన్స్ వారోత్సవం

విశాఖపట్నం: కలెక్టరేట్‌లో సోమవారం గుడ్ గవర్నెన్స్ వారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవల్లో ఉన్న అధికారులంతా జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. జిల్లా విజ్ఞాన సమాచార అధికారి ఎస్‌హెచ్ పాషా వారోత్సవాల విశేషాలను వివరించారు. జిల్లాలో ప్లాస్టిక్ నిషేధం, సీఎస్ఆర్ నిధులతో ఆస్పత్రులు, పాఠశాలలు, హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పన, హెల్మెట్ వాడకంపై అవగాహనకు తీసుకున్న చర్యలను వెబ్ పోర్టల్‌లో పొందుపరిచిన తీరుపై వివరించారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడి ఆత్మహత్య

- ఆన్‌లైన్ గేమ్స్ కారణమంటున్న పోలీసులు



అరూస్ అమన్ మృతదేహం

సీతంపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ బాలుడు మృతిచెందాడు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కయ్యపాలెం పద్మశ్రీ ఆస్పత్రి వెనుక వీధిలో తాత, అమ్మమ్మల వద్ద ఉంటున్న అరూస్ అమన్ (13) బాత్‌రూమ్‌లో షూ లేసులతో ఉరి వేసుకున్నాడు. ఝార్ఖండ్‌లో ఉండే తల్లిదండ్రులు విడిపోవడంతో ఆరుస్ అమన్ తన తాతయ్య వినోద్‌కుమార్ షా వద్ద ఉంటూ నగరంలోని ఓ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఇంట్లో ఉన్నప్పుడు ఎక్కువగా మొబైల్‌లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడేవాడు. ఈ క్రమంలో ఏం జరిగిందో? సోమవారం సాయంత్రం బాత్‌రూమ్‌కి వెళ్లి ఎంతకీ రాలేదు. తలుపులు విరగ్గొట్టి చూసేసరికి షూ లేసులతో హ్యాంగర్‌కు ఉరివేసుకుని ఉన్నాడు. ఆస్పత్రికి తరలించేసరికే మృతి చెందాడు. దీంతో వినోద్‌కుమార్‌షా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ.సత్యనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

మత్తులో తల్లిని గాయపరిచిన తనయుడు



గాయపడిన లక్ష్మి

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు బానిసైన యువకుడు డబ్బు కోసం తల్లిని గాయపరిచాడు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాల మేరకు దింజూరి లక్ష్మి కుమారుడు సాయికుమార్ (18), కుమార్తె దేవితో కలిసి అక్కిరెడ్డిపాలెంలో నివసిస్తోంది. సాయికుమార్ చదువు మానేసి మత్తుకు బానిసయ్యాడు. డబ్బు కోసం తల్లిని నిత్యం వేధించేవాడు. ఆదివారం రాత్రి నగదు అడిగాడు. ఆమె నిరాకరించడంతో కర్రతో తీవ్రంగా గాయపరిచాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో చుట్టపక్కల వారు చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ పార్థసారథి, ఎస్ఐ సూర్యకళ సాయికుమార్‌కు అదుపులోకి తీసుకున్నారు. లక్ష్మిని ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి మృతికి కారణమైన ముద్దాయికి జైలు

విశాఖలీగల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తి మృతికి కారణమైన ముద్దాయికి ఐదేళ్ల జైలు, రూ.2వేల జరిమానా విధిస్తూ ఒకటో జిల్లా అదనపు న్యాయమూర్తి ఎం.వెంకటరమణ సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరునెలలు అదనంగా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. అదనపు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పీజీఎస్ఎస్ ప్రసాదరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లా పెదబయలు మండలం పెద్దకోడపల్లికి చెందిన గంపదర సత్తిబాబు పంట పొలానికి అడవి జంతువులు రాకుండా కంచె నిర్మించాడు. దానికి ఎలాంటి అనుమతి లేకుండా రాత్రిపూట విద్యుత్ ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన మజ్జి బాలరాజు 2014 సెప్టెంబరు 5న సంతకు వెళ్లేందుకు కంచె ఉన్న ప్రాంతం దాటుతూ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య నూకాలమ్మ ఫిర్యాదు మేరకు పెదబయలు పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

'కోణార్క్ లాడ్జి వెనుక స్థలంపై వివాదం లేదు'

విశాఖపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లోని కోణార్క్ లాడ్జి వెనుక ఉన్న ప్లాట్-5బి స్థలంపై వివాదాలు లేవని స్థలయజమానులు వీవీవీ సుబ్రహ్మణ్యం, వీజే దాసు, వి.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్థలంపై వివాదాలు కోర్టులో ఉండగానే ప్రహరీ తొలగించి, చదును చేస్తున్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని 'మహానిర్లక్ష్యం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 17న కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్థలయజమానుల తరపున లీగల్ అడ్వైజర్ బీపీ రాజారావు, సృజన్ వివరణ ఇచ్చారు. ఆ స్థలాన్ని వేగి వెంకటేశ్వరరావు 1972లో కొనుగోలు చేశారని, భవన నిర్మాణానికి జీవీఎంసీకి 2016లో దరఖాస్తు చేయగా తిరస్కరించడంతో హైకోర్టులో కేసు వేశామన్నారు. తీర్పు అనుకూలంగా వచ్చిందన్నారు. 50 ఏళ్లుగా తమ ఆధీనంలో ఉందని, జీవీఎంసీకి పన్ను చెల్లిస్తున్నామన్నారు. ఈనెల 23న పనులు ప్రారంభించగా జీవీఎంసీ సిబ్బంది అడ్డుకున్నారని, దీనిపై కోర్టు ధిక్కరణ కేసు వేస్తామన్నారు. జీవీఎంసీ జోన్-3 ఏసీపీ మధుసూదనరావుని వివరణ కోరగా కేసు పెండింగ్‌లో ఉన్నందునే ప్లాన్ జారీచేయలేదని, జిల్లా కో-ఆపరేటివ్ సొసైటీ నుంచి క్లియరెన్స్ వస్తే చూస్తామన్నారు.

'టీడీఆర్ ఇచ్చిన మేరకు స్థలం అప్పగిస్తాం'

విశాఖపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణలో కోల్పోతున్న స్థలానికి జీవీఎంసీ టీడీఆర్ జారీచేసిందున స్వాధీనం చేసుకోవాలని ఎం.హరినారాయణ కోరారు. ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లేఅవుట్‌లో డైమండ్‌పార్కు ఉత్తర వైపు స్థలాన్ని ఆనుకుని శంకరమఠంవైపు రోడ్డు విస్తరించాల్సి ఉంది. దీంతో ఆస్థలంలో పది అడుగులు జీవీఎంసీకి అప్పగించినందున నాలుగు రెట్లు ఎక్కువ టీడీఆర్ జారీచేసింది. అయినా స్వాధీనం చేసుకోలేదంటూ ఈనెల 18న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన జోన్-3 టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సలం కొలతలు వేశారు. దీంతో యజమాని స్థలాన్ని అప్పగించడానికి అభ్యంతరం లేదన్నారు.